# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 19 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు గురువారం 24 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :19 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE THU 24 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో

## కొట్లాట..

**పోలీస్ స్టేషన్‌కు చేరిన సుమలత వర్సెస్ రఘు మాస్టర్ పంచాయితీ!**

పెన్ పవర్ డెస్క్:టాలీవుడ్ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో అం తర్గత వర్గ విభేదాలు ఒక్కసారిగా తీవ్ర రూపం దాల్చాయి. హైదరాబాద్ లోని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫీస్ ప్రాంగణంలోనే ఇరు వర్గాల డ్యాన్సర్లు పరస్పరం ఘర్షణకు దిగడంతో ఉద్రిక్త

- మిగతా 2లో

## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!

**ఎన్నికల కమిషన్‌పై ప్రియాంక గాంధీ తీవ్ర వ్యాఖ్యలు**



- ఎన్నికల రిగ్గింగ్ గురించి తెలిసి సీఈసీ అనుమతిస్తే దేశద్రోహమని వ్యాఖ్య
- ఈసీలో అవకతవకలపై వస్తున్న కథనాలు అత్యంత తీవ్రమైనవని వ్యాఖ్య
- ఈ ఘటనపై సరైన దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్

- మిగతా 2లో



## బీజేపీలో భారీ మార్పులు..

**28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు**

- ఏపీ బీజేపీ ఇంచార్జ్‌గా అర్విండ్ భదౌరియా
- తెలంగాణ ఇంచార్జ్‌గా సునీల్ భన్సల్
- ఒడిశా ఇంచార్జ్‌గా పురందేశ్వరి

- మిగతా 2లో

## అంబానీని వెనక్కి నెట్టిన అదానీ.. తగ్గిన ముఖేశ్ అంబానీ సంపద!

- మళ్లీ భారత్ కుబేరుడిగా గౌతమ్ అదానీ
- ముఖేశ్ అంబానీని వెనక్కి నెట్టి అగ్రస్థానం కైవసం
- వీ3వీ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026లో వెల్లడి
- జాబితాలో పెరిగిన మహిళా సంపన్నుల సంఖ్య
- ఏఐ, టెక్ రంగాల నుంచి కొత్త కుబేరుల వెల్లువ



పెన్ పవర్ డెస్క్:భారత సంపన్నుల జాబితాలో కీలక మార్పు చోటుచేసుకుంది. ముఖేశ్ అంబానీని అధిగమించి, గౌతమ్ అదానీ మరోసారి దేశంలోనే అత్యంత సంపన్నుడిగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. 'వీ3వీ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026' ఈ వివరాలను వెల్లడించింది.ఈ నివేదిక ప్రకారం, గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం సంపద 13 శాతం వృద్ధితో రూ. 9.23 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో, ముఖేశ్ అంబానీ సంపద 10 శాతం తగ్గి రూ. 8.63 లక్షల కోట్లకు పరిమితమైంది. దీంతో అదానీ సుమారు రూ. 59,400 కోట్ల ఆధిక్యంతో

- మిగతా 2లో



తిరుమలలో వైభవంగా

## చక్రస్నానం..

**ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు**

- శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు నేడు చక్రస్నానం
- పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించిన వేలాది మంది భక్తులు
- మలయప్ప స్వామి, సుదర్శన చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం
- 8 రోజుల్లో 5.76 లక్షల మందికి శ్రీవారి దర్శనం కల్పించినట్లు తెలిపిన టీటీడీ
- సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఉత్సవాలు విజయవంతం చేశామన్న బీఆర్ నాయుడు

- మిగతా 2లో

## ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు.. సీఎం చంద్రబాబు సమీక్ష



- శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటనున్న వాయుగుండం
- ఉత్తరాంధ్ర జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల సూచన
- గంటకు 85 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం
- యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- మిగతా 2లో

## సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత

# యువతరానిదే

- అమరావతిని ప్రపంచం మెచ్చే నగరంగా తీర్చిదిద్దుతాం
- ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు 12 ఎకరాలు కేటాయింపు
- రూ.60 వేల కోట్లతో రాజధానిలో రోడ్ల నిర్మాణం
- అమరావతిలో హెల్త్‌కేర్ హబ్, క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు
- ఏఐ, డేటా సెంటర్లు, డీప్‌టెక్ రంగాలకు ప్రాధాన్యం
- ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలి
- సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో యువత ముందుండాలి



పెన్ పవర్ డెస్క్: ప్రపంచమంతా మెచ్చే నగరంగా అమరావతి మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఫౌండేషన్ కార్యక్రమంలో సీఎం పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రాజధానిలో నిర్మించే ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలని ఆకాంక్షించారు. ఈ ఇనిస్టిట్యూట్‌కి 12 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు."అమరావతికి అనేక ఉన్నత విద్యాసంస్థలు వచ్చాయి.. వస్తున్నాయి. రూ.60వేల కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నాం. రాజధానికి స్పోర్ట్స్ సిటీ, విమానాశ్రయం వస్తాయి. అమరావతి హెల్త్ కేర్ హబ్‌గా మారుతుంది. క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్.. గేమ్ ఛేంజర్స్ అవుతాయి. ప్రపంచంలో ఆరు దేశాల్లోనే క్వాంటమ్ ఉంది.. అమరావతికీ వస్తుంది. 21 కంపెనీలు స్టార్టప్‌లతో ముందుకొచ్చాయి. ఏఐ, డేటా

- మిగతా 2లో

### రౌడీ గ్యాంగ్‌తో జగన్ అరాచకాలు చేయిస్తున్నారు: చంద్రబాబు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు ఎస్ఈసీ ఎప్పుడు షెడ్యూల్ ప్రకటించినా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఇన్‌ఛార్జ్ మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుని వచ్చే బాధ్యతను ఇన్‌ఛార్జి మంత్రులు తీసుకోవాలని స్పష్టం చేశారు. కేబినెట్ భేటీ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రులకు ఎలక్షన్

- మిగతా 2లో



## ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

**ఏపీ క్యాబినెట్ నిర్ణయాలు**

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం
- రాష్ట్రానికి రూ.22,171.84 కోట్ల భారీ పెట్టుబడులకు ఆమోదం, 19,739 మందికి ఉపాధి
- మచిలీపట్నంలో రూ.8,000 కోట్లతో గోవా షిప్‌యార్డ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరంలో కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల డీఏల మంజూరుకు ఆమోదముద్ర

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. కేవలం ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ.22,171.84 కోట్ల విలువైన భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా, రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని చాటిచెప్పింది. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 19,739 మంది యువతకు ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులకు రెండు డీఏలకు ఆమోదం తెలపడంతోటు, రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్ సమావేశానంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

**జగన్ పై మంత్రి ఫైర్**

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, గత వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో

- మిగతా 2లో

## టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!



- టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో 51 మందిపై రౌడీ షీట్లు
- వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెళ్ల అప్పిరెడ్డి, నేత దేవినేని అవినాష్ పేర్లు
- 2021 అక్టోబర్‌లో జరిగిన ఘటనపై ప్రస్తుత ప్రభుత్వంలో సీఐడీ విచారణ
- ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో 9 పోలీస్ స్టేషన్లలో షీట్ల నమోదు
- చంద్రబాబు నివాసంపై దాడి కేసును కూడా సీఐడీకి అప్పగించిన ప్రభుత్వం

- మిగతా 2లో

## చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములు కేటాయిస్తున్నారు

- విశాఖ వైసీపీ నేతలతో సమావేశమైన జగన్
- కూటమి ప్రభుత్వంలో అడ్డగోలుగా భూములు పంచుకుంటున్నారని ఆరోపణ
- ప్రతి గ్రామంలో మంద్యం, గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని మండిపాటు



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ ఈరోజు విశాఖపట్నానికి చెందిన పార్టీ నేతలతో తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.రాష్ట్రంలో రూపాయికి చాక్లెట్ వస్తుందో లేదో తెలియదు కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములను కేటాయిస్తున్నారని విమర్శించారు. గీతం యూనివర్సిటీ పేరుతో 55 ఎకరాల భూమిని కేటాయించారంటే

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## న్యూక్లియర్ ఫ్యూజన్ లో భారత్ ముందడుగు

న్యూక్లియర్ ఫ్యూజన్ ఎనర్జీ రంగంలో భారత్ మరో మైలురాయిని అధిగమించింది. సూర్యుడి కేంద్రం కన్నా 20 రెట్ల వేడి ప్లాస్మాను సృష్టించారు. గుజరాత్‌లోని ప్లాస్మా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐపీఆర్)కు చెందిన సూ-1 టోకామాక్‌పై కొత్త శక్తివంతమైన గైరో ట్రాన్ వ్యవస్థను విజయవంతంగా ప్రారంభించారు. ఇది 82.6 గిగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ, 400 కిలోవాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. టోకామాక్‌లోని అత్యంత వేడి ప్లాస్మాను మరింత వేడి చేయడానికి ఈ కొత్త పరికరం ఉపయోగపడుతుంది. స్టడీ స్టేట్ సూపర్‌కండక్టింగ్ టోకామాక్ అనే పరికరం, నియంత్రిత పద్ధతుల్లో సూర్యుడిపై జరిగే న్యూక్లియర్ ఫ్యూజన్ ప్రక్రియను నిర్వహిస్తుంది. టోకామాక్‌లోని బలమైన అయస్కాంత క్షేత్రం ప్లాస్మాను నియంత్రిస్తుంది. తాజా పరిశోధనల్లో ప్లాస్మా ఉష్ణోగ్రత 20 కోట్ల డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా చేరింది. ఇది సూర్యుడి కేంద్రంలో ఉత్పత్తి అవుతున్న వేడి కన్నా దాదాపు 10-20 రెట్లు ఎక్కువ. గైరో ట్రాన్ అనేది అధిక ఫ్రీక్వెన్సీ మైక్రోవేవ్ శక్తిని ఉత్పత్తి చేసే ప్రత్యేక పరికరం. ఈ శక్తిని టోకామాక్‌లోని ప్లాస్మాలోకి పంపించడం ద్వారా దాని ఉష్ణోగ్రతను మరింత పెంచుతారు. సూ-1లో ఇంతకుముందు 42 గిగాహెర్ట్జ్ జైరోట్రాన్ వ్యవస్థను ఉపయోగించారు. ఇప్పుడు ఏర్పాటు చేసిన 82.6 గిగాహెర్ట్జ్ వ్యవస్థ అధిక సామర్థ్యంతో ప్లాస్మాను వేడి చేయడానికి సహాయపడుతుంది. ఫ్యూజన్ ప్రక్రియలో ప్లాస్మాను అత్యంత వేడికి చేర్చడమే కాకుండా, దానిని తగిన సమయం పాటు స్థిరంగా ఉంచడం కూడా అత్యంత కీలకం. కొత్త గైరో ట్రాన్ ఈ ప్రయోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సైంటిస్టులకు ఉపయోగపడింది. ఫ్యూజన్ (కేంద్ర సంలీన చర్య) ముఖ్యంగా సూర్యుడి వంటి నక్షత్రాల్లో జరుగుతుంది. దీని వల్ల అపారమైన శక్తి వెలువడుతుంది. స్వచ్ఛమైన భారీ స్థాయిలో శక్తిని అందించగల సామర్థ్యం దీని సొంతం. ఇందులో హైడ్రోజన్ ఐసోటోపులను ఇంధనంగా ఉపయోగించే అవకాశం ఉంది. హైడ్రోజన్ ఐసోటోపులు ఢీకొని హీలియంగా మారి, భారీ శక్తి విడుదల అవుతుందిప్రస్తుతం సాంప్రదాయ అణు విద్యుత్ కేంద్రాల్లో జరిగే న్యూక్లియన్ ఫిజన్(కేంద్ర విచ్ఛత్తి చర్య) వల్ల యురేనియం లేదా ప్లూటోనియం ఢీకొట్టుకోవడం వల్ల చిన్న కేంద్రకాలుగా విడిపోతుంది. దీని వల్ల శక్తి విడుదల అవుతుంది. ఫిషన్‌తో పోలిస్తే ఫ్యూజన్ చర్యలో దీర్ఘకాలికంగా నిల్వ చేయాల్సిన రేడియోధార్మిక వ్యర్థాల సమస్య తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. తక్కువ ఇంధనంతో భారీ శక్తిని ఉత్పత్తి చేయవచ్చు. అణు రియాక్టర్లలో న్యూక్లియన్ ఫిషన్ చర్య ఒక విచ్ఛత్తి మరో విచ్ఛత్తికి దారి తీసే చైన్ రియాక్షన్ ఉంటుంది. ఫ్యూజన్‌లో ప్లాస్మా పరిస్థితులు కొనసాగకుంటే ఫ్యూజన్ చర్య వెంటనే స్వయంగా ఆగిపోతోంది. దీని వల్ల పెద్ద ప్రమాదాలు ఉదాహరణకు చెర్నోబిల్ వంటి ప్రమాదాలు ఉండవు. ఫ్యూజన్ చర్యలో విడుదలయ్యే హీలియం రేడియో యాక్టివ్ కాదు. అణు వ్యర్థాల సమస్యే ఉండదు.

# ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

- మొదటి పేజి తరువాయి

విరుచుకుపడ్డారు. "ఒకవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తూ, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఐదేళ్ల విఫల నాయకుడు జగన్ రాష్ట్రంలో విధ్వంసం, అలజడి సృష్టించి పెట్టుబడిదారులను భయపెట్టాలని చూస్తున్నారు. గొడ్డలి పార్టీ నాయకుడి చర్యలు అత్యంత శోచనీయం. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీకి రాకుండా, తన ఇంటినే అసెంబ్లీగా మార్చుకుని, సొంత పత్రిక ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయ పరిస్థితి దేశంలో మరే రాష్ట్రంలోనూ ఉండదు" అని పార్థసారథి తీవ్రంగా ధ్వజమెత్తారు .డీఎస్సీ నియామకాల విషయంలో కూడా చిన్న సమస్యలను పట్టుకుని యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అత్యున్నత స్థానానికి తీసుకెళ్లి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు.

**కృష్ణా జిల్లాకు వరం.. మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్**

కేబినెట్ నిర్ణయాల్లో అత్యంత కీలకమైనది కృష్ణా జిల్లాకు దక్కిన భారీ వరం. రక్షణ రంగంలో ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన గోవా షిప్‌యార్డ్, మచిలీపట్నంలో తమ నౌకా నిర్మాణ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.8,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ప్రభుత్వం ఈ సంస్థకు 400 ఎకరాల భూమిని, 1.7 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని కేటాయించింది. ఇప్పటికే రూ.30,000 కోట్ల ఆర్డర్లతో ఉన్న ఈ సంస్థ వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని, దీనివల్ల ఒకవైపు పోర్టు, మరోవైపు షిప్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లతో కృష్ణా జిల్లా స్వరూపమే మారిపోతుందని మంత్రి పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కృషి చేసిన సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

**పారిశ్రామిక, శాంతిభద్రతలపై కీలక నిర్ణయాలు**

పరిశ్రమలకు పెద్దపీట: ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ 'డిక్సన్', గత ప్రభుత్వ హయాంలో ఎంఓయూ చేసుకుని వెనక్కి వెళ్లిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని హబ్‌గా మార్చే 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు ప్రభుత్వం వసతులు కల్పించనుంది. కొత్త పోలీస్ కమిషనరేట్లు: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కొనేందుకు తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఐజీ/డీఐజీ స్థాయి అధికారి కమిషనర్‌గా వ్యవహరిస్తారు. దీంతోపాటు సైబర్, సోషల్ మీడియా నేరాలను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో 20 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ఉద్యోగులకు డబుల్ బొనాంజా: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సీఎం చంద్రబాబు తీపికబురు అందించారు. వారికి 1.7.2024 నుంచి 2.73%, 1.1.2025 నుంచి 1.82% చొప్పున రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**అమరావతి పునరుజ్జీవం.. రైతులకు న్యాయం**

అసెంబ్లీకి రూ.661 కోట్లు: అమరావతిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో, తెలుగు ప్రజలు గర్వపడేలా శాసనసభ భవనం నిర్మించేందుకు రూ.661 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. రాజధానిలోని గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కోసం మరో రూ.1,543.98 కోట్లను కేటాయించారు. చిన్న రైతులకు భరోసా: భూ సమీకరణ పథకం కింద ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన రైతులకు కూడా ఎకరాకు వర్తించే విధంగా వార్షిక కౌలు (యాన్యుటీ) చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది రాజధాని రైతులకు ఎఎని ఊరటనిచ్చే నిర్ణయం.

**ఇతర ముఖ్యమైన నిర్ణయాలు**

మద్యం పాలసీ: మద్యం దుకాణాల లైసెన్సులను పునరుద్ధరిస్తూ, ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. తొలిసారి ఉల్లంఘిస్తే రూ.10 లక్షల జరిమానా, రెండోసారి లైసెన్స్ రద్దు చేయాలని నిర్ణయించారు.

షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ: మూతపడిన సహకార చక్కెర కర్మాగారాల (చోడవరం, గోవాడ మొదలైనవి) సమస్యల పరిష్కారానికి, రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం రుణం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

సామాజిక మీడియా పాలసీ: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు 'సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ పాలసీ'కి ఆమోదం తెలిపారు. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా వారికి పారితోషికం చెల్లిస్తారు.

న్యాయాధికారుల పదవీ విరమణ: న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఆర్డినెన్స్ ముసాయిదాకు ఆమోదం తెలిపారు.

భూ కేటాయింపులు: సాగర్మాల ప్రాజెక్టుల కింద భూసేకరణకు ఏపీఐఐసీకి రూ.2,500 కోట్ల టర్మ్ లోన్ వినియోగానికి, విజయనగరంలో మిల్లెట్ల ప్రాసెసింగ్ యూనిట్ కోసం డీఆర్‌డీఏకు ఉచితంగా భూమి కేటాయింపు వంటి అనేక నిర్ణయాలు తీసుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్లు: వార్డు సచివాలయాల్లోని పలు కేటగిరీల ఉద్యోగులకు ప్రమోషన్ అవకాశాలు కల్పించేందుకు, ప్రత్యేక సర్వీస్ రూల్స్ రూపొందించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం ద్వారా కూటమి ప్రభుత్వం ఒకవైపు పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే, మరోవైపు ఉద్యోగ, రైత, ప్రజా సంక్షేమానికి, పరిపాలన సంస్కరణలకు కట్టుబడి ఉన్నామని స్పష్టమైన సందేశాన్ని పంపింది.

# టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంచలనం సృష్టించిన టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసుకు సంబంధించి వైసీపీకి చెందిన పలువురు కీలక నేతలు సహా మొత్తం 51 మందిపై రౌడీ షీట్లు తెరవాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ జాబితాలో వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెల్ల అప్పిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్ వంటి ప్రముఖుల పేర్లు ఉండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వివరాల్లోకి వెళితే, 2021 అక్టోబర్ 19న గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై పెద్ద ఎత్తున దాడి జరిగింది. ఈ ఘటనపై తాజాగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల ఎస్హెచ్ఓలకు రౌడీ షీట్లు తెరవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ ప్రక్రియను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)లకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

గతంలో వైసీపీ అధికారంలో ఉండగా ఈ దాడి జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో వైసీపీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కర్రలు, సుత్తులతో కార్యాలయంలోకి చొరబడి ఫర్నిచర్, కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. ఆవరణలో నిలిపి ఉంచిన కార్లను కూడా ధ్వంసం చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు.

ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో తలశిల రఘురాం, దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సహా మొత్తం 110 మందిపై కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్లు 147, 148, 323, 324, 326, 307, 380, 427, 459, 452, 506 రెడ్ విత్ 109, 120-బి, 149 కింద కేసు నమోదు చేసి

దర్యాప్తు చేపట్టారు. 2024 జూన్‌లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసుపై మళ్లీ దృష్టి సారించింది.

2024 అక్టోబర్ లో ఈ కేసు దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. దీంతో పాటు 2021 సెప్టెంబర్‌లో చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి కేసును కూడా సీఐడీ విచారణకు బదిలీ చేసింది. తాజా పరిణామాలతో పాత కేసుల దర్యాప్తులో వేగం పుంజుకోవడం, వైసీపీ నేతలపై రౌడీ షీట్లు తెరవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# తిరుమలలో వైభవంగా చక్రస్నానం..

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నాడు చక్రస్నానంతో కన్నులపండువగా ముగిశాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల చివరి రోజున స్వామి పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు. అంతకుముందు, ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి సర్వభూపాల పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ భూవరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో శంఖులు, కలశాల ద్వారా అభిషేకం చేశారు. ఈ సమయంలో వేద పండితులు ఉపనిషత్తులు, పంచ సూక్తాలు (పురుష, శ్రీ, భూ, నీలా, విష్ణు) పఠించగా, జీయర్ స్వాముల సమక్షంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు. అభిషేకం అనంతరం, సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా స్వామి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, వేదమంత్రాల ఘోష నడుమ పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. అదే శుభ సమయంలో, "గోవిందా... గోవిందా..." అంటూ భక్తి పారవశ్యంతో నామస్మరణ చేస్తూ, పుష్కరిణి వద్ద వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదర్శన చక్రం స్పృశించిన జలాల్లో స్నానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఆగమశాస్త్రం ప్రకారం, బ్రహ్మోత్సవాలను ఒక మహాయజ్ఞంగా పరిగణిస్తారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు జరిగితే, ఈ చక్రస్నానం (అవభృథ స్నానం) ద్వారా అవి తొలగిపోయి, భక్తులకు, లోకానికి సంపూర్ణ ఫలం, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నమ్మకం.

**విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు**

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నిరంతర మార్గదర్శకత్వంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. భక్తులకు

ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, వసతి, అన్నప్రసాదం, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాలపై సీఎం సూచనలతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. గత 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించామని, ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా సమష్టిగా పనిచేశామని వివరించారు. ఈ విజయానికి సహకరించిన అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సేవే తమ ప్రథమ కర్తవ్యమని, శ్రీవారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో కొట్లాట..

- మొదటి పేజి తరువాయి

పరిస్థితులు నెలకొన్నాయి. అసోసియేషన్ 'మినిట్స్ బుక్' దక్కించుకునే క్రమంలో ప్రస్తుత అధ్యక్షురాలు, జానీ మాస్టర్ భార్య సుమలత, కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ గొడవ ముదిరి రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. అసోసియేషన్ కు సంబంధం లేని వ్యక్తులు కుట్రతో తమపై దాడి చేశారని సుమలత ఆరోపించింది. సుమలత మనుషులే తమపై దాడి చేశారంటూ రఘు మాస్టర్ వర్గం పేర్కొంది. ఈ ఘటనపై ఇరువర్గాలు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సుమలత తీరుపై ఆగ్రహంతో ఉన్న కొందరు తోటి డ్యాన్సర్లు ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ గొడవకు కారణం.. అంతకుముందు తెలుగు ఫిలిం ఫెడరేషన్ తీసుకున్న ఒక సంచలన నిర్ణయం.. డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో నెలకొన్న సమస్యలను తేల్చేందుకు ఫెడరేషన్ పెద్దలు సుమలత, రఘు మాస్టర్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం 225 మంది సినీ డ్యాన్సర్లు హాజరైన ఈ మీటింగ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా అభిప్రాయ సేకరణ జరిపారు.

ఈ ఓటింగ్‌లో ఏకంగా 214 మంది డ్యాన్సర్లు రఘు మాస్టర్‌కే మద్దతు తెలపగా.. సుమలత వైపు కేవలం 11 మంది మాత్రమే నిలిచారు.

దీంతో మెజారిటీ నిర్ణయం మేరకు సుమలత నేతృత్వంలోని కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఫెడరేషన్ ప్రకటించింది. అంతేకాకుండా, అక్టోబర్ 11న అసోసియేషన్ నూతన ఎన్నికలు నిర్వహిస్తామని షెడ్యూల్ విడుదల చేసింది.

ఫెడరేషన్ తీసుకున్న ఈ ఊహించని షాకింగ్ నిర్ణయం, ఎన్నికల షెడ్యూల్‌తో డ్యాన్సర్ల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఏకంగా ఫిల్మ్ ఛాంబర్‌లోనే దాడికి పాల్పడేంతగా వివాదం చెలరేగడంతో అక్టోబర్ 11న జరగబోయే ఎన్నికలు ఇంకెన్ని మలుపులు తిరుగుతాయోనని ఇండస్ట్రీ వర్గాలు ఉత్కంఠగా గమనిస్తున్నాయి.

# బీజేపీలో భారీ మార్పులు..

రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జులు, సహ-ఇంచార్జుల జాబితాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు. తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ-ఇంచార్జులుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).

ఆంధ్రప్రదేశ్: అర్వింద్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ-ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

**తమిళనాడు:** రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా, కో-ఇంచార్జులుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురానా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఒడిశా: దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ-ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

కర్ణాటక: హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ-ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

ఉత్తర ప్రదేశ్: దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ

ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ-ఇంచార్జ్‌లను కేటాయించారు.

మహారాష్ట్ర: బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ-ఇంచార్జులుగా నియమించారు.

ఛత్తీస్‌గఢ్ - హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

ఢిల్లీ: డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో-ఇంచార్జులుగా నియమించారు.

గుజరాత్: తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

హిమాచల్ ప్రదేశ్: శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

మధ్యప్రదేశ్: మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

# రౌడీ గ్యాంగ్‌తో జగన్ అరాచకాలు చేయిస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

టార్గెట్ నుంచి లా అండ్ ఆర్డర్ వరకు అన్ని అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై రైల్వే యాక్ట్ తరహాలో కఠిన చట్టం తీసుకురావాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాజకీయ నాయకుల ముసుగులో అసాంఘిక శక్తులు విధ్వంసానికి పాల్పడుతున్నాయని, వైకాపా రౌడీ మూకలు అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. జగన్ బెంగళూరులో కూర్చుని రౌడీ గ్యాంగ్ ద్వారా ఏపీలో అరాచకాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. లా అండ్ ఆర్డర్‌ను దెబ్బతీసే ఎలాంటి ప్రయత్నాన్నీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. శాప్ కార్యాలయం వద్ద జరిగిన దాడి ఘటన.. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడిన తీరు బట్టబయలైందని చంద్రబాబు అన్నారు. శాప్ కార్యాలయం, టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌పై జరిగిన దాడుల్లో ఒకే వ్యక్తులు ఉన్నారన్న అంశాన్ని ప్రస్తావించారు. వైసీపీ నేతలు జరగని విషయాలను జరిగినట్లుగా ప్రచారం చేయడంలో సిద్ధహస్తులని ఆరోపిస్తూ, ఉద్దేశపూర్వకంగా బురద చల్లే ప్రయత్నాలను తిప్పికొట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

# సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత యువతరానిదే

- మొదటి పేజి తరువాయి

సెంటర్, క్వాంటమ్, డీప్ టెక్నాలజీ వస్తున్నాయి. కర్నూలులో అన్ని రకాల డ్రోన్లు తయారు చేస్తున్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. భవిష్యత్తు అంతా ఇన్నోవేషన్స్ రంగానిదే. ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలి. సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత యువతరానిదే" అని సీఎం చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి నారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు.. సీఎం చంద్రబాబు సమీక్ష

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రాష్ట్రం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఈ తీవ్ర వాయుగుండం శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇది తీరం దాటే సమయంలో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, జిల్లా కలెక్టర్లు, అధికారులు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని తెలిసి కూడా సీఈసీ వాటిని అనుమతించి ఉంటే, అటువంటి చర్య దేశద్రోహం కిందకే వస్తుందని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం తన వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నీలంబూరులో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కమిషన్ (ఈసీ) పనితీరులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయని వెలువడిన మీడియా కథనాలపై ఆమె స్పందించారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికి "అత్యంత ప్రమాదకరం" అని ఆమె అభివర్ణించారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సందర్భంగా పేర్ల తొలగింపు సహా పలు ఇతర అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అసమ్మతి వ్యక్తం చేశారన్న కథనాలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించారని గత కొంతకాలంగా వస్తున్న ఆరోపణలను ఆమె గుర్తుచేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగకపోతే లేదా ఈసీయే అక్రమాలకు సహకరిస్తే, అది ప్రజాస్వామ్యంపై జరిగిన గొడ్డలిపెట్టుగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల కమిషన్ ఇదివరకే స్పష్టం చేయడం గమనార్హం.

# అంబానీని వెనక్కి నెట్టిన అదానీ.. తగ్గిన ముఖేశ్ అంబానీ సంపద!

- మొదటి పేజి తరువాయి

అంబానీని వెనక్కి నెట్టారు. ఈ జాబితాలో ఆర్సెలర్‌మిట్టల్ యజమాని ఎల్.ఎన్. మిట్టల్ కుటుంబం 93 శాతం వృద్ధితో, రూ. 3.39 లక్షల కోట్ల సంపదతో మూడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జాబితాలో మహిళా సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హం. కొత్తగా 131 మంది మహిళలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. మహిళల విభాగంలో రూ. 2.79 లక్షల కోట్ల సంపదతో రోష్నీ నాడార్ మల్హోత్రా అగ్రస్థానంలో నిలిచారు. దేశంలో డాలర్ బిలియనీర్ల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో 391కి చేరింది. అత్యధిక సంపన్నులు ఉన్న నగరంగా ముంబై ప్రథమ స్థానంలో నిలవగా, బెంగళూరు, ఢిల్లీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సాంకేతిక రంగం నుంచి కొత్త సంపన్నుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగానికి చెందిన 19 మంది ఈ జాబితాలో స్థానం సంపాదించగా, వారిలో 15 మంది కొత్తవారు కావడం విశేషం. క్వాంటం కంప్యూటింగ్ విభాగం నుంచి తొలిసారిగా బెంగళూరుకు చెందిన నాగేంద్ర నాగరాజ రూ. 1,700 కోట్ల సంపదతో ఈ జాబితాలో చేరారు.

## చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములు కేటాయిస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రభుత్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని, అడ్డగోలుగా భూములను పంచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో గంజాయితో పాటు విచ్చలవిడిగా మద్యం దొరుకుతోందని, గుళ్ళు, బడుల పక్కన కూడా బెల్టు షాపులు వెలిశాయని మండిపడ్డారు. విశాఖ మేయర్, కార్పొరేషన్‌ను ప్రభుత్వం హైజాక్ చేసిన తీరును ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అండగా ఉంటుందని, విశాఖలోని తాగునీటి సమస్యలు, భూముల అక్రమాలపై ప్రజల్లో పోరాడాలని సూచించారు. చంద్రబాబుకు ప్రజాస్వామ్యం అంటే లెక్కలేదని, 2019 నంద్యాల ఉపఎన్నిక నుంచి పోలీసులను అడ్డుపెట్టుకుని అరాచకాలు చేస్తున్నారని ఆరోపించారు. తాత్కాలిక అధికారంతో విర్రవీగినా... శాశ్వతంగా నిలిచేది ప్రజాస్వామ్యమేనని, ప్రజల తీర్పు నుంచి ఎవరూ తప్పించుకోలేరని పేర్కొన్నారు.

## కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ పై అధికారులు దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశం

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

శాఖల పనితీరును తెలిపే కేపీఐ ( కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ) లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో పలు శాఖలతో ఆయన సమావేశం నిర్వహించి వాటి పనితీరుపై సమీక్షించారు. కేపీఐలను ప్రభుత్వం క్రమంగా సమీక్షిస్తూ జిల్లాల వారీగా పురోగతిని పరిశీలిస్తున్నందున అన్ని శాఖల అధికారులు వీటిపై మరింత శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ చెప్పారు. మన జిల్లాతో సంబంధం లేని అంశాలను రాష్ట్ర ప్రభుత్వం పొందుపరిస్తే వెంటనే ఆయా విషయాలను శాఖాధిపతుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని తొలగించేలా చూడాలని ఆయన దిశానిర్దేశం చేశారు. మొత్తంగా చూస్తే జిల్లా ర్యాంకు మెరుగైన స్థాయిలో ఉండేలా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ సుధాకర్



రెడ్డి, డిఎఫ్వో ( టెరిటోరియల్) వినోద్ కుమార్, ఏపీఎంఐపి పిడి శ్రీనివాసులు, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ. నాగేశ్వరరావు, ఉద్యాన అధికారి గోపీచంద్, జిల్లా సహకార అధికారి శ్రీలక్ష్మి, డిపిఓ అనుపమ, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసరావు, డ్వామా పి.డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# రోడ్లన్నీ ఆటోలమయం.. నడవలేని పరిస్థితి..!

**మార్కాపురం లో ఈ-ఆటోల దెబ్బకు కుప్పకూలిన ట్రాఫిక్**

**3000 దాటిన ఆటోలు, రోడ్లన్నీ వాటివే, ప్రయాణికుల భద్రత గాలిలో**

**అడ్డగోలుగా ఆపేస్తున్నారు, నడి రోడ్డుపై నరకం**

**సైలెంట్ గా వచ్చి ఢీ కొడుతున్న ఈ- ఆటోలు**

**యూనియన్ మౌనం, ఆర్టిఓ, పోలీస్ శాఖ నిర్లక్ష్యం**

**మార్కాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 23**

మార్కాపురం పట్టణంలో ప్రస్తుతం ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా అదుపుతప్పింది. దీనికి ప్రధాన కారణం పట్టణంలో విచ్చలవిడిగా పెరిగిపోయిన ఆటోలు, ముఖ్యంగా ఈ మధ్యకాలంలో వచ్చిన ఎలక్ట్రికల్ ఆటోలు. గత ఏడాది వరకు పట్టణంలో సుమారు 1200 నుండి 1500 వరకు ఆటోలు ఉండేవి. కానీ తక్కువ ధర, తక్కువ మెయింటెనెన్స్ అనే కారణంతో ఈ-ఆటోలు వచ్చాక వాటి సంఖ్య ఒక్కసారిగా 3000కు పైగా చేరిందని అంచనా. రోడ్లు మాత్రం అదే వెడల్పుతో ఉండగా, ఆటోల సంఖ్య మూడు రెట్లు పెరగడంతో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు దోర్నాల బస్టాండ్,కంభం బస్టాండ్,కోర్టు సెంటర్, ఆర్టిసి రోడ్డులలో అడుగు కూడా వేయలేని దుర్భర పరిస్థితి నెలకొంది.

**గుర్తింపే లేని ఆటోలు.. రెడ్ నెంబర్ మాయం!**

నిబంధనల ప్రకారం ప్రతి ఆటోకు ఆర్టిఓ ఇచ్చే రిజిస్ట్రేషన్ నెంబర్ తో పాటు, ఆటో సైడ్ బాడీపై ఎరుపు రంగులో పెద్ద అక్షరాలతో రాసే పర్మిట్ నెంబర్ / జోన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలి. దీనివల్ల ఏ ఆటో ఏ ప్రాంతానికి చెందినదో, దానికి పర్మిట్ ఉందో లేదో వెంటనే తెలుస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో మార్కాపురంలో తిరిగే 70 శాతం ఆటోలకు, ముఖ్యంగా కొత్తగా వచ్చిన ఈ-ఆటోలకు ఆ రెడ్ మార్క్ నెంబర్లు లేనే లేవు. కొన్ని ఆటోలకు అసలు వెనుక నెంబర్ ప్లేట్ కూడా ఉండటం లేదు. ఇలా గుర్తు తెలియని ఆటో ఏదైనా ప్రమాదం చేసి వెళ్లిపోతే బాధితుడు ఎవరికి ఫిర్యాదు చేయాలి? ఇది ప్రయాణికుల భద్రతా పరంగా పెద్ద లోపంగా మారింది.

**యూనిఫాం ఏది? బ్యాడ్జ్ ఏది? రూల్స్ గాలికి..!**

ఆటో నడపాలంటే నిబంధనల ప్రకారం డ్రైవర్



తప్పనిసరిగా ఖాకీ యూనిఫాం ధరించాలి, మెడలో ఫోటోతో కూడిన డ్రైవింగ్ లైసెన్స్ బ్యాడ్జ్ వేసుకోవాలి. కానీ మార్కాపురంలో ఇవేవీ కనిపించవు. యూనిఫాం వేసుకునే డ్రైవర్ కనిపించడం అరుదుగా మారింది. ఇష్టానుసారం బస్టాండ్ ఎదురుగా, మార్కెట్ సెంటర్ లో రోడ్డుకు అడ్డంగా ఆటోలు ఆపేయడం, ఒక ఆటోలో 8 నుండి 10 మందిని కుక్కి ఓవర్ లోడ్ తో తీసుకెళ్లడం సాధారణమైపోయింది. దీనివల్ల ట్రాఫిక్ జామ్ లతో పాటు ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి.

**18 ఏళ్లు కూడా లేవు.. చేతిలో ఆటో స్టీరింగ్..!**

ఈ మధ్య మార్కాపురంలో అత్యంత ఆందోళన కలిగించే అంశం మైనర్లు ఆటోలు నడపడం. 18 ఏళ్లు నిండని 15, 16, 17 ఏళ్ల యువకులు చాలామంది ఇష్టారాజ్యంగా ఆటోలు నడుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, కనీస ట్రాఫిక్ రూల్స్ తెలియకుండా, అతివేగంగా, నిర్లక్ష్యంగా వీరు ఆటోలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. తల్లిదండ్రులు కూడా డబ్బు కోసం తమ మైనర్ పిల్లల చేతికి ఆటో స్టీరింగ్ ఇవ్వడం బాధ్యతారాహిత్యంగా మారింది.

**మందు తాగి ఆటో నడుపుతున్నా.. బ్రీత్ టెస్ట్ ఎక్కడ..?**

పట్టణంలో కొందరు ఆటో డ్రైవర్లు మద్యం సేవించి ఆటోలు నడుపుతున్నారనే ఆరోపణలు బహిరంగ రహస్యమే. రాత్రి వేళల్లో ఇది మరింత ఎక్కువగా కనిపిస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. అయినప్పటికీ పోలీసులు వారికి ఎప్పుడూ బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించడం లేదు. ద్విచక్ర వాహనదారులను ఆపి హెల్మెట్ లేదని ఫైన్లు వేసే పోలీసులు, ఆటోల విషయంలో కనీస కౌన్సిలింగ్ కూడా ఇవ్వకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

**యూనియన్ మౌనం.. ఆర్ టి ఓ, పోలీసుల నిర్లక్ష్యం..!**

ఈ అరాచకాన్ని అరికట్టాల్సిన ఆటో యూనియన్ నాయకులు తమ డ్రైవర్లకు క్రమశిక్షణ నేర్పాల్సి ఉండగా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. యూనియన్ అంటే కేవలం కలెక్షన్లకే తప్ప, నిబంధనలు అమలు చేయడానికి కాదా అని ప్రశ్నలు వస్తున్నాయి. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టడం లేదు. ఆర్ టి ఓ అధికారులు ఎప్పుడైనా తనిఖీలు చేసింది లేదు, ఫీజులు, పన్నులు వస్తే చాలు అన్నట్లు మాకెందుకులే అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారనే విమర్శలు ప్రజల్లో బలంగా ఉన్నాయి.

**ఇన్సూరెన్స్ లేకపోతే ప్రయాణికుడి పరిస్థితి ఏమిటి..?**

అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఇన్సూరెన్స్. పర్మిట్, ఫిట్ నెస్ లేని, నెంబర్ కూడా సరిగా లేని ఆటోలకు ఇన్సూరెన్స్ ఉంటుందా అనేది అనుమానమే. ఒకవేళ అలాంటి ఆటో ప్రమాదానికి గురైతే, అందులో ఉన్న ప్రయాణికుడికి ఎవరు నష్టపరిహారం ఇస్తారు? ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా పత్రాలు సరిగా లేని వాహనాలకు క్లెయిమ్ ఇవ్వవు. దీంతో బాధిత ప్రయాణికుడు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అందుకే అధికారులు ఈ కోణంలో కూడా ఆలోచించి తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది.

**అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి...**

“ఎలక్ట్రిక్ ఆటోలు వచ్చాక సౌండ్ లేకుండా వెనుక నుండి వచ్చి ఢీకొడుతున్నాయి. పెద్ద శబ్దం కూడా రాదు. పైగా నెంబర్ లేకపోతే మేము ఎవరికి చెప్పుకోవాలి? అధికారులు వెంటనే ప్రత్యేక డ్రైవ్ పెట్టి, నెంబర్ లేని, పర్మిట్ లేని ఆటోలను సీజ్ చేయాలి అని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ అందరు ఆటో డ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని మా ఉద్దేశం కాదు. నిబంధనలు పాటిస్తూ, నిజాయితీగా కష్టపడి తమ కుటుంబాన్ని పోషించుకునే వందలాది మంది మంచి డ్రైవర్లు మార్కాపురంలో ఉన్నారు. కానీ కొందరు చేసే తప్పుల వల్ల మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు వస్తోంది.

# సమన్వయంతో హరితాంధ్ర సాధన

### - జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి





**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

హరితాంధ్ర సాధనకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి చెప్పారు. బుధవారం ఆమె అధ్యక్షతన ప్రకాశం భవనంలో జిల్లా హరిత అభివృద్ధి సొసైటీ ( డిస్ట్రిక్ట్ గ్రీనరీ డెవలప్మెంట్ ఏజెన్సీ - డీ.జీ.డీ.ఏ.) సమావేశం జరిగింది. రాష్ట్రస్థాయిలో ‘ ఏపీ గ్రీన్ ‘ సొసైటీ తరహాలో జిల్లాస్థాయిలో డిజిడిఏ ఏర్పాటుకు ప్రభుత్వం జీవో జారీ చేసినట్లు డీఎఫ్వో (సామాజిక) రాజశేఖర్ ఈ సందర్భంగా వివరించారు. జిల్లాలో అవసరాలను బట్టి వివిధ అధికారులను కూడా ఈ సొసైటీలోకి తీసుకునే సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. 2047 నాటికి 50 శాతం పచ్చదనాన్ని సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం దిశానిర్దేశం చేసిందన్నారు. ఈ సొసైటీకి జాయింట్ కలెక్టర్ చైర్మన్ గా ఉంటారు. సభ్యులుగా ఉన్న డిపిఓ అనుపమ, ఇంచార్జి డ్వామా పి.డి. వెంకటేశ్వరరావు, డీఈవో రేణుక, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, డీఎఫ్వో (టెరిటోరియల్) వినోద్ కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసరావు, రోడ్లు భవనాల శాఖ ఎస్.ఈ. రవి నాయక్, జలవనరుల శాఖ ఇంచార్జ్ ఈ.ఎస్. శివరామ్, డివిజనల్ అభివృద్ధి అధికారులు, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు. కాగా, జడ్పీ సీఈవో, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, సిపిఓ, సర్వే శాఖ సహాయ సంచాలకులను కూడా ఈ సొసైటీలోకి సభ్యులుగా చేర్చాలని జాయింట్ కలెక్టర్ చెప్పారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కూడా కమిటీలోకి తీసుకోనున్నారు. హరితాంధ్ర సాధనే లక్ష్యంగా సమన్వయంతో ముందుకు సాగాలని ఆమె స్పష్టం చేశారు. మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

# ఇంటి స్లాబ్ నిర్మాణానికి అడ్డంకులు?

### - అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో పనులు అడ్డుకున్నారంటూ బాధితుడి ఆవేదన

### -రెండంతస్తుల భవనాలకు ఓ న్యాయం.. మాకో న్యాయమా?

**కందుకూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 23:** మండలంలోని ఓగూరు ఆదిఆంధ్ర కాలనీలో ఇంటి మరమ్మతు పనులకు అడ్డంకులు సృష్టించారంటూ ఓ కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. కాలనీకి చెందిన కోట మల్లికార్జున సుమారు 20 సంవత్సరాల క్రితం ఇంటిని నిర్మించుకున్నాడు. ప్రస్తుతం గత కొన్ని రోజులుగా ఇంటి మరమ్మతు పనులు చేపడుతున్నాడు. ఇందులో భాగంగా ఇంటిపై ఒక గది ఏర్పాటు చేసి స్లాబ్ పోసుకునేందుకు పనులు చేపట్టగా, గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుల సూచనలతో అధికారులు వచ్చి నిర్మాణ పనులు నిలిపివేయించారని బాధితులు ఆరోపించారు. స్లాబ్ పోయేందుకు వచ్చిన మిల్లర్‌ను పోలీసులు



అక్కడి నుంచి పంపించేశారని తెలిపారు.

**రెండంతస్తుల భవనాలకు ఓ న్యాయం.. మాకో న్యాయమా?...:** గ్రామంలో పలువురు రెండంతస్తుల భవనాలు నిర్మించుకున్నారని, తమ విషయంలో మాత్రం అభ్యంతరాలు వ్యక్తం చేయడం అన్యాయమని బాధితులు ప్రశ్నించారు. తాము హైదరాబాద్‌లో బతుకుదెరువు కోసం నివసిస్తున్నామని, తమ బిడ్డ వివాహం కుదరడంతో స్వగ్రామంలోని ఇంటి పనులు చేపట్టుకుంటున్నామని తెలిపారు. ఈ సమయంలో తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నిర్మాణ పనులకు అనుమతులు, నిబంధనలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని, తమకు న్యాయం చేయాలని కోట మల్లికార్జున కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# సీపీఏపీ కార్యాలయంపై దాడిపై ఫిర్యాదు..

## డీఎస్పీ అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్

### -గవర్నర్‌ను కలిసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం సెప్టెంబర్ 23**

సీపీఏపీ కార్యాలయం వద్ద జరిగిన దాడి ఘటనపై ఫిర్యాదు చేయడంతో పాటు డీఎస్పీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సంబంధిత అంశాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ తూమాటి మాధవరావుతో పాటు మాజీ మంత్రులు అంబటి రాంబాబు, బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జక్కంపూడి రాజా, పార్వతారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వారుధు కళ్యాణి, ఉషశ్రీ చరణ్, రమేష్ యాదవ్, మేరుగ నాగార్జున, మల్లాది విష్ణు, చెల్లుబోయిన వేణుగోపాల్ కృష్ణ, పేర్ని నాని తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే తాడిపర్తి చంద్రశేఖర్, మొండితోక అరుణ్‌కుమార్, కల్పలతారెడ్డి, తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, ఆలూరి సాంబశివరెడ్డి, రాయని భాగ్యశ్రీ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.





# ఏఐతో ఇంజినీరింగ్ బోధనకు కొత్త దిశ

## –ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు ప్రత్యేక అవగాహన సదస్సు

**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 23**

కృత్రిమ మేధస్సు ఆధారిత బోధనా విధానాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి), కందుకూరులోని పరిశోధన అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో "ది ఏఐ--ఆగ్మెంటెడ్ ప్రొఫెసర్: ఎన్‌హాన్సింగ్ ఇంజినీరింగ్ పెడగాజీ" అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు.మొదటి సెషన్‌లో ఆచార్య వరదరాజన్, మాజీ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇంజినీరింగ్ విద్యలో కృత్రిమ మేధస్సు ప్రభావం, అధ్యాపకుల మారుతున్న పాత్ర, భవిష్యత్ బోధనా విధానాలపై ప్రసంగించారు. అనంతరం విద్యుక్తి ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అనిల్ కంచి ఏఐ ఆధారిత విద్యావైజ్ వేదికను ప్రత్యక్షంగా ప్రదర్శిస్తూ, కోర్సు రూపకల్పన, పాఠ్య ప్రణాళిక, విద్యార్థుల అభ్యాస విశ్లేషణలో ఏఐ వినియోగాన్ని వివరించారు.అదేవిధంగా, ఏఐ రంగంలో నైపుణ్యాలు పెంపొందించుకునే విద్యార్థులకు తమ సంస్థ ద్వారా ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించనున్నట్లు ప్రకటించి, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణతో పాటు ప్రాక్టికల్ అనుభవాన్ని అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు తమ బోధనా నైపుణ్యాలను



నిరంతరం మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ ఆధారిత బోధనా విధానాలు విద్యా నాణ్యతను పెంపొందించడంతో పాటు విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు మరింత సమర్థంగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు.ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ, ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు అధ్యాపకుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించి, ఆధునిక బోధనా విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆర్ అండ్ డీ డీన్ డా. ఎం. లక్ష్మణరావు



ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆర్ అండ్ డీ కోఆర్డినేటర్ డా. కె. మోహన్ రావు సమన్వయం చేశారు.కార్యక్రమంలో కళాశాలకు చెందిన వివిధ విభాగాల విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, రీసెర్చ్ స్కాలర్లు, ఐక్యూఏసీ సభ్యులతో పాటు విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఏఐ ఆధారిత బోధన, స్మార్ట్ కోర్స్‌వేర్ రూపకల్పన, అభ్యాస ఫలితాల విశ్లేషణపై జరిగిన చర్చలు పాల్గొన్న వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

# ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

### –డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి





**కందుకూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 23**

ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని డీఎస్పీ బాలసుబ్రమణ్యం సూచించారు. బుధవారం కందుకూరు డీఎస్పీ కార్యాలయంలో పట్టణానికి చెందిన 20 మంది ఆటో డ్రైవర్లకు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పోలీస్ నంబర్లను అందజేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, వెహికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటి అన్ని చెల్లుబాటు అయ్యే పత్రాలను కలిగి ఉండాలని తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. ప్రయాణికులతో సత్ప్రవర్తనతో వ్యవహరించాలని, వాహనాలు నడిపేటప్పుడు భద్రతా నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు.కందుకూరు సబ్‌డివిజన్ పరిధిలోని ఆటో డ్రైవర్లందరూ సంబంధిత పోలీస్ స్టేషన్లలో పోలీస్ నంబర్లను తీసుకోవాలని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో కందుకూరు సీఐ షేక్ అన్వర్ బాషా, కందుకూరు పట్టణ ఎస్సై బండ్ల భార్గవ్, కందుకూరు రూరల్ ఎస్సై బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం జిల్లా ను కరువు జిల్లాగా ప్రకటించాలి

### – రైతు సంఘం,వ్యవసాయ కార్మిక సంఘం, కవులు రైతు సంఘం,వృత్తి దారులు సంఘాలు డిమాండ్



**ప్రకాశం, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

ప్రకాశం జిల్లా ను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ బుధవారం రైతు సంఘం,వ్యవసాయ కార్మిక సంఘం,కవులు రైతు సంఘం,వృత్తి దారులు సంఘాలు ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా రెవిన్యూ అధికారి కి సమస్యల పై అర్జీ అందజేశారు. రబీ సీజన్ లో విత్తనాలను 100 శాతం సబ్సిడీపై ఉచితంగా సరఫరా చేయాలని, ఎరువుల సరఫరాలో కొత్తగా పెట్టిన యాపెల్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానంలో ఎరువులు సరఫరా చేయాలని కోరారు. ఋణాలు రీ షెడ్యూల్ చేసి కొత్తగా వ్యవసాయ ఋణాలు ఇవ్వాలని, జిల్లాలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులకు తగిన నిధులు కేటాయించి, త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పశుగ్రాసాన్ని ఉచితంగా సరఫరా చేయాలని, నీటి తొట్టెలను ఏర్పాటుచేసి నీరు నింపాలని కోరారు. సాగర్ నీటితో చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్ లు పూర్తిగా నింపాలని, అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులను విస్తృతంగా కల్పించి, కూలీలకు ఉపాధి కల్పించాలని కోరారు. వ్యవసాయ కూలీల కుటుంబాలకు నెలకు 30 కిలోల బియ్యాన్ని ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష.. కార్యదర్శులు పమిడి వెంకట రావు, జుజ్జూరి జయంతి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.జి.మస్తాన్,నెరుసల వెంకటేశ్వర్లు, కవులు రైతు సంఘం కార్యదర్శి వి.బాలకోటయ్య, వృత్తి దారులు సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతయ్య,రైతులు వేజండ్ల సింగయ్య,కనపర్తి సుబ్బారావు,ఉబ్బ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సిఎం వైఎస్ జగన్ ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

మాజీ సిఎం,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని తాడేపల్లిలోని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ముందుగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గ్రేటర్ విశాఖకు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తల సమావేశంలో కదిరి బాబురావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రేటర్ విశాఖలోని స్థానిక సమస్యలు, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. అదేవిదంగా స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రేటర్ విశాఖపట్నం ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని జగన్ మోహన్ రెడ్డి సూచించారని తెలిపారు.



# ప్రజాసేవలో చెరగని ముద్ర ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం

### – జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం





**కందుకూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగిసిన సందర్భంగా ప్రజాప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రత్నజ్యోతి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి సుశీల మాధవరావు, జడ్పీటీసీ



తొట్టెంపూడి అనసూర్య శ్రీనివాసరావు దంపతులతో పాటు ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులుగా వారు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ శాలువాలు కప్పి సత్కరించారు. పదవీకాలం పూర్తిచేసుకున్న ప్రజాప్రతినిధులకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సంబంధిత ప్రజాప్రతినిధులు స్వర్ణ పున్నయ్య, అల్లం సుమతి తదితర ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# క్విస్ ఎన్ సీసీ క్యాడెట్ కి ఆల్ ఇండియా లెవెల్ గోల్డ్ మెడల్

### - అభినందించిన కాలేజి యాజమాన్యం



**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ సీసీ క్యాడెట్ కే. విజయ్ అరుదైన ఘనత సాధించాడు. జాతీయ స్థాయిలో అబ్ స్టకిల్ ట్రైనింగ్ లో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడు. కాలేజి, జిల్లా,



స్టేట్ లెవెల్స్ ని పూర్తి చేసుకుని జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ మేరకు ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా థల్ సైనిక్ క్యాంప్ లో గుంటూరు గ్రూప్ తరపున ఏపీ నుంచి సెలెక్ట్ అయిన విజయ్ వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడు. ఎన్ సీసీ విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరపున గోల్డ్ మెడల్ సాధించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ మేరకు ఎన్ సీసీ క్యాడెట్ విజయ్ ని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి అభినందించారు. ఇలాంటి విజయం సాధించడం గర్వకారణంగా ఉందని ఈ సందర్భంగా అన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, వివిధ విభాగాలకు చెందిన డీన్ లు, డైరెక్టర్లు, హెచ్ వోడీలు పాల్గొని విజయ్ ని అభినందించారు. క్విస్ కళాశాలలో ఎన్ సీసీని ఎంతో ప్రోత్సహిస్తారని, యాజమాన్యం సహకారంతోనే జాతీయస్థాయికి వెళ్లగలిగానని విజయ్ ఈ సందర్భంగా తెలియజేశాడు. ఈ సందర్భంగా యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశాడు.

# హెచ్ఐవీ-ఎయిడ్స్ పై అవగాహనకు 5కే రెడ్ రన్

**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

హెచ్ఐవీ-ఎయిడ్స్ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మార్కాపురంలో బుధవారం 5కే మారథాన్ (రెడ్ రన్ 2025) ఘనంగా నిర్వహించారు.జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మారథాన్ ను కోర్టు సెంటర్ వద్ద జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,




హెచ్ఐవీపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, నివారణ చర్యలపై చైతన్యం కల్పించడమే ఈ రన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. యువత, విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ మారథాన్ లో జిల్లా వైద్యాధికారులు, ఎయిడ్స్ నియంత్రణ శాఖ సిబ్బంది, విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎర్ర బెలూన్లు, అవగాహన బ్యానర్లతో వారు

# విమాన యానం.. రైల్వే శాఖలపై జరిగిన చర్చలో పాల్గొన్న ఎం పి మాగుంట




**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ స్టడీ టూర్ లో భాగంగా బుధవారం ముంబై లోని ట్రిడెంట్ హోటల్ లో కమిటీ చైర్మన్ కె.సి. వేణుగోపాల్ ఆధ్వర్యంలో పౌర విమానయాన శాఖతో చర్చలో పిఏసి సభ్యులు, ఒంగోలు లోక్ సభ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. ప్రజా మౌలిక వసతులు, ఇతర ప్రజా సేవలపై విధించే రుసుములు, టారిఫ్‌లు, వినియోగదారుల చార్జీల విధింపు, నియంత్రణ అంశంపై పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డిజిసిఏ, బిసిఏఎస్,ఏఏఐ మహారాష్ట్ర ప్రభుత్వం ఇతర సంబంధిత సంస్థల ప్రతినిధులతో చర్చించారు.సిఏజి నివేదిక నం. 31, 2026 ఆధారంగా భారతీయ రైల్వేల్లో నాన్-సబర్బన్ రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యాలు పారిశుద్ధ్యం అంశంపై రైల్వే బోర్డు, సెంట్రల్ రైల్వే, వెస్టర్న్ రైల్వే ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలోనూ మాగుంట ఇతర కమిటీ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

# నాణ్యమైన నిరంతరాయ విద్యుత్తు అందించడం విద్యుత్ శాఖ ప్రధాన ధ్యేయం

### - విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ ఎస్ విక్టర్ ఇమ్మానియేల్

### - ఒంగోలులో ఘనంగా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (అదాలత్)




**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయడమే విద్యుత్ శాఖ ప్రధాన ధ్యేయమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్ ) చైర్మన్ ఎస్. విక్టర్ ఇమ్మానియేల్ స్పష్టం చేశారు. ఒంగోలు డివిజన్‌లోని సర్కిల్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో 'విద్యుత్ అదాలత్' కార్యక్రమం నిర్వహించారు. ఈ అదాలత్‌లో ఒంగోలు డివిజన్ పరిధిలోని పలు గ్రామాల నుంచి హాజరైన వినియోగదారులు తమ సమస్యలపై మొత్తం 9 అర్జీలను సమర్పించారు. వీటిలో 4 సమస్యలను ఉన్నతాధికారుల సమక్షంలో అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది. మిగిలిన 5 అర్జీలను సంబంధిత అధికారులు త్వరితగతిన క్షేత్రస్థాయిలో పరిశీలించి, సత్వరమే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని చైర్మన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు డి. కృష్ణా నాయక్, ఆర్థిక సభ్యులు కృష్ణ, స్వతంత్ర సభ్యులు సునీత, జిల్లా ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఈఈ మాకినేని హరిబాబు వీరితో పాటు వివిధ మండలాల అసిస్టెంట్ ఇంజనీర్లు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం

**పొన్నలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 23**

స్థానిక ఆయుర్వేద ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం ఆయుర్వేద వైద్యరాలు కె.వి పద్మజాకుమారి ఆధ్వర్యంలో ధన్వంతరి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయుర్వేద వైద్య విధాన ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేయటం పాటు ఆరోగ్య పరిరక్షణలో ఆయుర్వేదం అందించే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు గుమ్మడి వర్ధన రాజు గ్రామంలోని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# త్రిశూల్ కార్యక్రమం పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

## - జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు - కాన్వెక్స్ అద్దాల ఏర్పాటుతో తగ్గిన రోడ్డు ప్రమాదాలు - జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు





**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

ప్రమాదకర 54 రోడ్డుల పై రోడ్డు రావాణా సంస్థ డ్రైవర్లకు అవగహన కల్పించి ప్రమాదాలు జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరమంలో మాదక ద్రవ్యాల వినోయోగ నిరోధం, మహిళా సంరక్షణ, రహదారి భద్రత ల పై ఏర్పాటు చేసిన త్రిశూలం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ. హర్ష వర్ధన్ రాజుతో పాటు కలసి జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు పాల్గొన్నారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై సి.సి. కెమెరాలు పనిచేసేలా అవసరమైతే వై.ఫై వినియోగించుకోవాలని సంబంధిత జాతీయ రహదారి అధికారులకు సూచించారు. సమస్యాత్మక ప్రదేశాల నిరంతర పర్యవేక్షణతో పాటు గస్తీ నిర్వహించాలన్నారు. గతంలో కంటే జిల్లాలో తీసుకున్న పలు చర్యల వల్ల మహిళ ల పై అఘాయిత్యాలు తగ్గాయన్నారు. నషా ముక్త్ భారత్ పై గ్రామాల్లో అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలనీ జిల్లా పంచాయతి అధికారికి సూచించారు. సమస్యాత్మక ప్రదేశాలలో విధిగా పర్యవెక్షణ ఉండేలా చూడడం ద్వారా ప్రమాదాల నివారణకు అవకాశం ఏర్పడుతుందన్నారు. వన్ హాట్ స్పాట్ వన్ ఆఫీసర్ ను ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాల నిరనివారణకు అవకాశం ఏర్పడుతుందన్నారు. త్రిశూల్ కార్యక్రమం పై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి స్కూళ్ళలో కాలేజీలలో అవగాహన కల్పించాలని, అదే విధముగా జిల్లాలో వినూత్నముగా నిర్వహిస్తున్న యువ సాథీ కార్యక్రమం ద్వారా త్రిశూల్ కార్యక్రం పై అవగాహన కల్పించే విధంగా గ్రూప్ విద్యార్థులకు నియమించిన మెంటార్లకు అవగాహన కల్పించి నో బ్యాగ్ డే సందర్బంగా నిర్వహించే కార్యక్రమములో త్రిశూల్ కార్యక్రమం పై అవగాహన పెంపొందేలా చూడాలన్నారు. ఎస్పీ హర్ష వర్ధన్ రాజు మాట్లాడుతూ జిల్లాలో గాంజా వంటి మత్తు పానియాల వినియోగం, మహిళలపై అకృత్యాలు గణనీయంగా తగ్గాయన్నారు. రహదారి భద్రతలో భాగంగా ప్రమాదాల నివారణకు సుమారు మూడు వందల కాన్వెక్స్ అద్దాలు వివిధ ప్రాంతాలలో అమర్చడం జరిగిందన్నారు. అలాగా వివిధ ప్రాతాలలో పి.ఎ సిస్టం ద్వారా తెలియ చేయడం జరుగుతుందన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చోట అవుట్ పోస్టులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శ్రీ శైలం ఘాట్ రోడ్ లో సుమారు 18 కాన్వెక్స్ అద్దాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలు అదుపు చేయడం జరిగిందన్నారు. జాయింట్ యాక్షన్ కమిటి ద్వారా అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. హై వేల పై ముందు జంక్షన్ ఉంది నిదానంగా వెళ్ళండి వంటి సూచనలతో పెయింటింగ్ వేయడం జరిగిందన్నారు. శక్తి టీము ల ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. అదే విధముగా ఈగల్ టీములు ఏర్పాటు ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమములో కందుకూరు సబ్ కలెక్టర్ హిమ వంశీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం, రెవిన్యూ డివిజినల్ అధికారులు చంద్ర శేఖర్ నాయుడు, జ్యోతి కుమారి, డి.టి.సి ఆర్. సుశీల, ఐ.సి.డి.యస్ పి.డి పద్మ సునంద, జిల్లా విద్యా శాఖాధికారి రేణుక, ఒంగోలు మునిసిపల్ కమిషనర్ తుమ్మల వెంకట కృష్ణయ్య, డి.పి.ఓ అనుపమ, వివిధ శాఖల అధికారులు, మునిసిపల్ కమిషనర్ లు పాల్గొన్నారు.

## మానవతా సేవకు మరో ముందడుగు..

### హిందూ స్మశాన వాటికలో దహన సంస్కార షెడ్డు నిర్మాణానికి భూమి పూజ ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 23**

పట్టణంలోని పి ఆర్ కాలనీ దారి లో హిందూ స్మశాన వాటికలో దహన సంస్కార షెడ్డు నిర్మాణానికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, ఆపద సమయంలో అండగా నిలిచే సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఈ వి రమణ బాబు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పాలుగుళ్ళ శివారెడ్డి, సంస్థ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కి నివాళులు ముత్తుముల క్రిష్ణ కిశోర్



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 23**

రాచర్ల మండలం ఆకవీడు పంచాయతీ ఆకవీడు గ్రామం మాజీ సర్పంచ్ తలపాటి. దేవదానం (85) అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి పూల మాలతో నివాళులు అర్పించినారు. కార్యక్రమంలో రాచర్ల మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ని కలిసిన పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 23**

ఏపీ మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ని గిద్దలూరు వైసిపి నాయకులు ఏపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఎర్రగొండపాలెం పరిశీలకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లి లోని వైసీపీ కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డి ని ప్రవీణ్ కుమార్ రెడ్డి కలవగా స్థానిక విషయాలపై జగన్మోహన్ రెడ్డి ప్రవీణ్ కుమార్ రెడ్డిని ఆరా తీశారు. అలానే అతి త్వరలో వస్తున్న స్థానిక ఎన్నికలపై దృష్టి సారించాలని కార్యకర్తలను కలుపుకొని ముందుకు వెళుతూ మంచి ఫలితాలను సాధించాలని ప్రవీణ్ కుమార్ రెడ్డి కి జగన్మోహన్ రెడ్డి సూచించారు.

## వెల్లటూరులో స్వచ్ఛత హి సేవ

**పొన్నలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 23**

మండలంలోని వెల్లటూరు గ్రామంలో బుధవారం ఎంపీడీవో సతీష్ బాబు ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా డివిజనల్ డెవలప్మెంట్ అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ గ్రామాన్ని, ఇళ్లను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులు తమ పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రజలు, విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మన్నెం రమణయ్య, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.



## జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా రజనీకుమారి



**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

ప్రకాశం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిగా రజనీకుమారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం ప్రకాశం భవనంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యవసాయ శాఖలో జాయింట్ డైరెక్టర్ గా పదోన్నతి పొంది డిప్యుటేషన్ ద్వారా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిగా నియమించబడ్డారు.

## పిఆర్సి కమిటీని వెంటనే నియమించాలి..



**పుల్లల చెరువు పెన్ పవర్ సెప్టెంబర్ 23**

పిఆర్సి కమిటీని వెంటనే నియమించి ఐ.ఆర్ ప్రకటించాలని మార్కాపురం జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ( యుటిఎఫ్ ) ప్రధాన కార్యదర్శి ఓ వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పుల్లలచెరువు మండలంలో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను నిరంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తూ ఆ సమస్యలను పరిష్కరించడంలో యుటిఎఫ్ ముందంజలో ఉందని అన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని లేనిపక్షంలో అర్హత మార్కులనైనా తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల యూటీఎఫ్ అధ్యక్షులు కే ఉదయభాస్కర్, ప్రధాన కార్యదర్శి జె కాటంరాజు, జిల్లా కౌన్సిలర్లు ఆర్ మోహన్ బాబు, దేశావత్ వెంకటేశ్వర్లు నాయక్ లు, ఉపాధ్యక్షులు అల్లూరి శ్రీను, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ రూపుల్ నాయక్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలిపిన వెంకటేశ్వర్లు నాయక్

**పుల్లల చెరువు పెన్ పవర్ సెప్టెంబర్ 23**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో వర్ల రామయ్యను టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా వర్ల రామయ్యకు ఆయన పుష్పగుచ్ఛం అందించి,



శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా బాణావత్ వెంకటేశ్వర్లు నాయక్ మాట్లాడుతూ... పార్టీ అభివృద్ధికి, ప్రజల పక్షాన పోరాడేందుకు వర్ల రామయ్య చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పదవి లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఆయన ఎస్టీ, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి మరియు పార్టీ బలోపేతానికి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# స్వచ్ఛ పథ్ కార్యక్రమం అమలుకు ప్రజల సహకారం ఎంతో అవసరం

**స్వచ్ఛ పథ్ కార్యక్రమంలో భాగంగా గోపానిపల్లె**

**- బావాపురం రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారిన్ని తొలగించిన పారిశుద్ధ కార్మికులు.**

**పర్యవేక్షించిన కొమరోలు పంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీత, స్వర్ణ కొమరోలు కార్యదర్శి జనార్దన్ రెడ్డి.**





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 23**

స్వచ్ఛ పథ్ (పరిశుభ్రమైన రహదారి )కార్యక్రమంలో భాగంగా బుధవారం కొమరోలు మండలంలోని గోపానిపల్లె- బావాపురం గ్రామాల మధ్య గల లింకు రోడ్డు కు ఇరువైపుల పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని కొమరోలు పంచాయతీ అధికారిని వై గీత, స్వర్ణ కొమరోలు 3 ఇన్చార్జి కార్యదర్శి ఓ ఆర్ జనార్దన్ రెడ్డి పారిశుద్ధ కార్మికులతో తొలగింపజేశారు. ప్రతి నెల నాల్గవ బుధవారం స్వచ్ఛ పథ్ కార్యక్రమం ద్వారా గ్రామాల గ్రామాల మధ్య ఉన్న లింకు రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రపరచి ప్రజలకు ప్రయాణికులకు, పాదచారులకు సౌకర్యాన్ని కల్పించే కార్యక్రమం కొనసాగుతున్నది. కొమరోలు పంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీత ఒక్కొక నెల నాలుగో బుధవారం ఒక్కొక్క లింకు రోడ్డును ఎంపిక చేసుకొని స్వచ్ఛ పథ్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.అందులో భాగంగా ఈనెల 23వ తేదీ బుధవారం కొమరోలు పంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీత ఆధ్వర్యంలో గోపానిపల్లె బావ పురం గ్రామాల మధ్య గల లింకు రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పెరిగిన ముళ్ళ పొదలను పారిశుధ్య కార్మికులతో తొలగింపజేసి శుభ్రపరిచారు. ప్రజలు కూడా చెత్తాచెదారాన్ని బహిరంగ ప్రదేశాలలో,రోడ్లు ఇరువైపుల గల ఖాళీ ప్రదేశాలలో వేయకుండా వీధులలో పర్యటించే చెత్త సేకరణ ట్రాక్టర్ల లో మాత్రమే వేస్తూ పరిసరాల పరిశుభ్రతకు తోడ్పాటు అందించాలని పంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రోడ్లకు ఇరువైపులా గల మార్జిన్లలో వేస్తున్న చెత్తాచెదారం పేరుకుపోయి కుళ్ళిపోవటం వల్ల దుర్గంధం వెదజల్లుతూ ఆ రోడ్లపై రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులకు, పాదచారులకు అసహ్యం, అసౌకర్యం కలిగిస్తుందని ఆమె తెలిపారు. అంతేకాక అంటు వ్యాధులు కూడా వ్యాపించే ప్రమాదం ఉన్నదని ఆమె హెచ్చరించారు.కావున ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు తమ వంతు సహకారం అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాలు విజయవంతం అగుటకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ఆ కార్యక్రమంలో స్వర్ణ కొమరోలు 3 ఇన్చార్జి కార్యదర్శి ఓ ఆర్ జనార్దన్ రెడ్డి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## అల్లినగరంలో భక్తిశ్రద్ధలతో ముగిసిన సయ్యద్ మహబూబ్ సుభాని స్వాముల వారి గ్యార్మి ఉరుసు మహోత్సవ వేడుకలు

**అలంకరించిన స్వాములవారి భారీ జెండాలను ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి గ్రామంలో ఊరేగింపు.**

**ఉరుసు మహోత్సవ వేడుకల్లో పాల్గొన్న వందలాది మంది భక్తులు**





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 23**

కొమరోలు మండలం అల్లినగరంలో గల సయ్యద్ మహబూబ్ సుభాని ఖాద్రి షరీఫ్ దర్గాలో బుధవారం గ్యార్మీ ఉరుసు మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా గ్రామానికి ఉత్తరం వైపున ఉన్న మహబూబ్ సుభాని స్వాముల వారి దర్గా వద్ద నుంచి గ్రామానికి దక్షిణం వైపున ఉన్న నాగూర్ వలీ స్వామి దర్గా వరకు ప్రధాన ఆర్ఎంబి రోడ్డు ఇరువైపులా రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. దీనితో ప్రధాన వీధి కొత్త అందాన్ని సంచరించుకుని శోభాయ మానంగా మారింది. బుధవారం సాయంత్రం మగ్రిబ్ నమాజ్ అనంతరం గ్రామానికి దక్షిణం వైపున ఉన్న నాగూర్ వలి స్వాములవారి దర్గా వద్ద, మహబూబ్ సుభాని, మస్తాన్వలి, నాగూర్ వలి స్వాములవారి జెండాలను అలంకరించి ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి అక్కడి నుండి గ్రామానికి ఉత్తరం వైపున ఉన్న మహబూబ్ సుబహాని మస్తాన్వలి స్వాముల వారి దర్గాల వరకు మేళ తాళాలు, కనకతప్పట్లు, బాణసంచా కాల్పులు, ఫకీర్ల ఖసీదాలతో భారి ఊరేగింపు నిర్వహించారు. ఆ కార్యక్రమంలో అల్లినగరం గ్రామంతో పాటు పరిసర పరిసర గ్రామాల నుంచి కులమతాలకు అతీతంగా తరలివచ్చిన వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. మహబూబ్ సుభాని, మస్తాన్వలి స్వాముల దర్గాలలో జెండాలను ప్రతిష్టించి ఫాతిహాలు నిర్వహించారు. అనంతరం నాగూర్వలి స్వామి దర్గాలో కూడా స్వాముల వారి జెండాను ప్రతిష్టించి ఫాతిహాలు నిర్వహించారు. అనంతరం మహబూబ్ సుభాని దర్గా సమీపంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు కులమతులకు అతీతంగా పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గతంలో వలె ఈ ఏడాది కూడా మహబూబ్ సుభాని స్వాముల వారి గార్మి ఉరుసు మహోత్సవ వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో,ఆనంద ఉత్సవాలతో,ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రజలకు దాతలకు యువకులకు, ఉరుసు మహోత్సవ కమిటీ సభ్యులకు ఉరుసు మహోత్సవ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

# పంట నమోదు చేసుకుంటేనే భీమాకు అర్హులు

**పొన్నలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 23**

మండలంలోని కోటపాడు రాజోలుపాడు గ్రామాలలో మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వి రాము మాట్లాడుతూ పంట సాగు చేసే ప్రతి రైతు రైతు సేవా కేంద్రాలలో పంట నమోదు (ఈ పంట) చేసుకోవాలని, ఈ సీజన్ నుండి రైతే స్వయంగా పొలానికి వెళ్లి పంట నమోదు చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు, పంట నమోదు చేసుకొంటేనే పంట బీమా పథకానికి అర్హులు అవుతారని తెలియజేశారు,అంతేకాకుండా ప్రతి ఒక్కరూ మీ సేవా కేంద్రాలకు వెళ్లి పి ఎం కిసాన్ కి సంబంధించి ఈ కే వై సి చేసుకుంటేనే తదుపరి విడతకి అర్హత సాధిస్తారని తెలిపారు. ప్రతి రైతు రైతు సేవా కేంద్రాలలో మీ ఆధార్ కార్డు పట్టాదారు పాసు పుస్తకంతో రిజిస్ట్రేషన్ చేసుకొని రైతు విశిష్ట సంఖ్య పొందాలని (ఏ పి ఎఫ్ ఆర్ రిజిస్ట్రేషన్), తద్వారా అన్ని పథకాలకు అర్హత సాధిస్తారని తెలిపారు, లేనిచో ఏమి వర్తించవని తెలియజేశారు. ముఖ్యంగా రైతులు ఎల్ నీ నో ప్రభావంతో వర్షాలు లేని కారణంగా తక్కువ వర్షపాతం వలన నీటి లభ్యతను బట్టి, భూమిలో తేమ శాతం బట్టి రైతులు తక్కువ కాల పరిమితి ( 70-75 రోజుల) గల చిరు ధాన్యాలను,( మినుము , పెసర, బొబ్బర్లు, కొర్ర,రాగి)సాగుచేసుకోవాలని సూచించారు.తదుపరి కోటపాడు గ్రామంలో కంది వేసిన పంటను పరిశీలించారు.రైతులు కంది పంట వేసే ముందు ఎకరానికి యూరియా 20 కేజీలు, సింగిల్ సూపర్



ఫాస్ఫేట్ 125 కేజీలు వేసుకోవాలని, అలాగే 2-4 కిలోల విత్తనాలు వేసుకోవాలని, కిలో విత్తనానికి పురుగులు ఆశించకుండా ఇమిడక్లోప్రిడ్ 8 మి.లీ లేదా థియోమిథాక్షీ 10 మి.లీ కలిపి విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలి అని, ఎండు తెగులు సోకకుండా విత్తే ముందు 100 కిలోల బాగా చీకిన పశువుల ఎరువు లో ఒక లీటరు ట్రైకోడేర్మ విరిడి ఒక లీటరు సూడో మోనాస్ కలిపి ఒక ఎకరంలో సమానంగా చల్లుకోవాలని తెలిపారు.అలాగే ఎర్ర నెలలో సాళ్ళకి మధ్య 90 సెం.మీ మరియు



మొక్కకు మధ్య 20 సెం.మీ లేదా నల్ల రేగడి నెలల్లో సాళ్ళకు మధ్య 150 సెం.మీ, మొక్కకి మొక్కకి మధ్య 20 సెంటీ మీటర్ దూరం ఉండేటట్లు విత్తుకోవాలి అని సూచించారు.ప్రకృతి వ్యవసాయ అధికారి మందాకిని మాట్లాడుతూ బీజామృతం తో కంది విత్తనాని కి విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలి అని సూచించారు.ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులు కే .మధు, ఎం .కిషోర్ కుమార్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హరి కవిత, అనూష రెండు గ్రామాల నాయకులు, పెద్దలు , రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పొలాల్లో నీరు నిలవకుండా బయటకు మళ్ళించాలి



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

అల్ప పీడన ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు పొలాల్లో నిల్వ ఉండకుండా వెంటనే కాలువలను ఏర్పాటు చేసి బయటకు పంపాలని మండల వ్యవసాయ అధికారి పి.మధుబాబు తెలిపారు. బుధవారం మండలంలోని తుంగోడు, చిన్నపునాయునిపల్లి గ్రామాలలో సాగులో ఉన్న ఆముదం మరియు వరి పంటలను పరిశీలించి ముఖ్యంగా మిరప,కంది , కూరగాయల పంటల్లో నీటి నిల్వను నివారించాలని వర్షం కురుస్తున్న సమయంలో పురుగు మందులు లేదా ఆకులపై వేసే ఎరువులు పిచికారీ చేయకూడదు అని పిడుగులు, ఉరుములతో కూడిన వర్షం సమయంలో పొలాల్లోకి వెళ్లకూడదు అని వర్షాలు తగ్గిన తర్వాత పొలంలో నిల్వ ఉన్న నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలని పంటల్లో వేరు కుళ్లు, శిలీంధ్ర (ఫంగస్) తెగుళ్లు, పురుగు ఉధృతి ఉన్నాయా పరిశీలించాలని, అవసరమైనప్పుడు మాత్రమే వ్యవసాయ అధికారుల సలహాతో పురుగుమందులు పిచికారి చేయాలని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఈ-క్రాప్ పై రైతులకు దిశానిర్దేశం



**పీసీ పల్లి, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

మండలంలోని మురుగమ్మి, నేరేడుపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖాధికారి ఎన్ రంగా కృష్ణ ఆధ్వర్యంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఎన్. రంగ కృష్ణ మాట్లాడుతూ – ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ ఐడి నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు తమ మొబైల్ ద్వారానే సులభంగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఫార్మర్ ఐడి ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు, కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయాలు వాయిదాలకు అర్హులవుతారని వివరించారు. ప్రస్తుతం పంట బీమా నమోదుకు ఫార్మర్ ఐడి తప్పనిసరి చేశారని తెలిపారు. పంట నమోదు గడువు సెప్టెంబర్ 30 వరకు ఉందని, కంది పంట మరియు 20 రోజుల పంట కాలం ఉన్న రైతులు వెంటనే ఏపి ఏఐఎంఎస్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని ఏఈఓ షేక్ ఆయేషా సూచించారు. అనంతరం మురుగమ్మి గ్రామంలో పంట నమోదును అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

### కలెక్టర్ విజయ సునీత



**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం రెండో విడత కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లో జిల్లా అధికారులతో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 1 నుంచి 19 ఏళ్లలోపు 2,35,409 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. సెప్టెంబర్ 25న పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లో మాత్రలు వేయాలని, ఆ రోజు వేసుకోలేని వారికి అక్టోబర్ 5న మాప్-అప్ రోజున వేయాలని సూచించారు. 1-2 ఏళ్ల పిల్లలకు అర మాత్ర, 2-19 ఏళ్ల వారికి పూర్తి మాత్ర వేయాలని, 1-5 ఏళ్ల పిల్లలకు మాత్రను నీటిలో కలిపి ఇవ్వాలని తెలిపారు. మాత్రలు ఆరోగ్య సిబ్బంది సమక్షంలోనే వేయించాలన్నారు. అలాగే నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం తగ్గుతుందని, ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల కోసం రాపిడ్ రెస్పాన్స్ టీమ్ లు, 108 వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీ డా. చంద్రశేఖర్, డీఎంహెచ్ఓ డా. రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత

# ఆర్.పి. నరసయ్యకు ఏపీటీఎఫ్ ఘన సన్మానం



**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

ఉపాధ్యాయ వృత్తి కే వన్నె తెచ్చిన ఉపాధ్యాయులు నరసయ్య అని ఏపీటీఎఫ్ మార్కాపురం జిల్లా అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్ కొనియాడారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఆర్.పి. నరసయ్యను ఏపీటీఎఫ్ సి.ఎస్. పురం మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు.సి.ఎస్. పురం మెయిన్ స్కూల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, మండల అధ్యక్షులు తోట శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి జె.ఎస్. ఆనంద్ బాబు పాల్గొని నరసయ్యను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ నరసయ్య సార్ విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకితభావంతో సేవలందిస్తూ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడం అభినందనీయమన్నారు. నరసయ్య సేవలను గుర్తించి సన్మానించడం ద్వారా ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ సేవలకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన నరసయ్యకు వారు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత ఉత్తమంగా సేవలందించి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ



కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఒంగోలు వెంకటేశ్వర్లు, కె వెంకటేశ్వర్లు, యస్ చౌడేశ్వరమ్మ, షేక్ షరీఫ్, ఏపీటీఎఫ్ నాయకులు ఇండ్ల ప్రసాద్, విష్ణు , డి. సుబ్బరాయుడు, డి పున్నమ్మ, సి హెచ్ సునీతా దేవి, కె రామ సుబ్బారావు, జి వెంకటేశ్వర్లు, కె రవీంద్ర నాథ్,, కె చెన్నయ్య, ఎన్. గంగాధర్, గాంధీ, చాంద్ బాషా, టీ లక్ష్మీ నారాయణ, షేక్ రెహానా, బి శ్రీనివాసులు, బి చిన్న నారాయణ, ఏ వెంకట సుబ్బయ్య, అరియారం సాయి, ఎలికా శ్రీనివాసులు,చంద్ర శేఖర్ , జి పుల్లయ్య , ముప్పాళ్ల ప్రసాద్, సురేష్, జి. రవీంద్ర, మధుబాబు, హమ్మద్, ఎన్.వి. నారాయణ, యస్ వహీద్, పి అరుణ, యస్ నవనీత,ఏ శోభా రాణి, జె భారతి, షేక్ షబ్బీర్ తదితర ఏపీటీఎఫ్ నాయకులు, మండలంలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తదుపరి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ను ఘనంగా సత్కరించారు.

## కష్టజీవులకు లయన్స్ క్లబ్ అండ

### 20 మందికి గొడుగుల పంపిణీ





**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

ఎండకు, వానకు రోడ్డు పక్కన కష్టపడుతూ జీవనం సాగించే పేదలకు మార్కాపురం లయన్స్ క్లబ్ అండగా నిలిచింది.బుధవారం పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో గొడుగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు పక్కన చెప్పులు కుట్టేవారికి, లాగుడు బండ్లపై కూరగాయలు, పండ్లు అమ్ముకునే 20 మంది చిరు వ్యాపారులకు రూ.23,000 విలువైన గొడుగులను ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఎండలో, వానలో కష్టపడే పేదలకు చిన్న సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు శెట్టి జగన్ బాబు, జోనల్ చైర్మన్ టీవీ రామకృష్ణారావు, క్లబ్ సెక్రటరీ బి.వి.రంగయ్య, ట్రెజరర్ ఏవీ నారాయణరెడ్డి, డైరెక్టర్లు ఎంవీ రమణ, కోలా ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# దర్శిగుంట్ల లో నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

**సి.ఎస్.పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 23**

మండలంలోని డి జి పేట పంచాయతీ పరిధిలోని దర్శి గుంట్ల గ్రామంలోని రామాలయం దగ్గర గురువారం(నేడు) మధ్యాహ్నం 4 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు రమణమ్మ మెమోరియల్ మల్లికార్జున రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు డాక్టర్ పి. మల్లికార్జున రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన




మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో ఉచిత ఓపీ పరీక్షలు, ఉచిత రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఆయుర్వేదం ప్రకృతి ప్రసాదించిన అమృతం

### పూర్వీకులు అందించిన ఆరోగ్య సంపదను కాపాడుకోవాలి -మాదినేని లక్ష్మణ్

**సి.ఎస్.పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 23**

భారతీయ రుషులు, మహర్షులు ప్రకృతి నుంచి అందించిన అపూర్వమైన ఆరోగ్య విజ్ఞానమే ఆయుర్వేద వైద్యమని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాదినేని లక్ష్మణ్ అన్నారు. ఆయుర్వేద జాతీయ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పూర్వీకులు తరతరాలుగా అందించిన ఆయుర్వేద వైద్య విధానాన్ని, దాని విశిష్టతను మరోసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు ప్రకృతి ప్రసాదించిన అమృతంలా ఆయుర్వేదం భారతీయ జీవన విధానంలో అంతర్భాగంగా కొనసాగుతూ వచ్చిందన్నారు. మన పూర్వీకులు ప్రకృతిని నిశితంగా పరిశీలించి, వివిధ రకాల ఔషధ మొక్కలు, మూలికలు, ఆకులు, వేర్లు, బెరడులు, పుష్పాలు వంటి వాటిలో ఉన్న ఔషధ గుణాలను గుర్తించి వాటిని అనేక రకాల ఆరోగ్య సమస్యలకు ఉపయోగించేవారని తెలిపారు.ఆయుర్వేదం అనేది కేవలం అనారోగ్యం వచ్చిన తర్వాత మందులు తీసుకునే వైద్య విధానం కాదని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన జీవన విధానాన్ని కూడా సూచించే సమగ్ర వైద్య సంప్రదాయమని లక్ష్మణ్ వివరించారు. మన పూర్వీకులు తీసుకునే ఆహారం, పాటించే దినచర్య, ఋతువులకు అనుగుణంగా జీవించే విధానం, ప్రకృతితో మమేకమై ఉండే పద్ధతుల్లో కూడా ఆయుర్వేద సూత్రాలు కనిపిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పరిసరాల్లో



లభించే అనేక రకాల మొక్కలు, ఆకులు, వేర్లను పెద్దలు ఔషధాలుగా ఉపయోగించే వారిని గుర్తు చేశారు ఏ మొక్కను ఏ విధంగా ఉపయోగించాలి ఏ సందర్భంలో తీసుకోవాలి ఏ పదార్థాలతో కలిపి వినియోగించాలి అనే విషయాలను అనుభవం ద్వారా తెలుసుకొని తర్వాత తరాలకు అందించాలని తెలిపారు ఈ సంప్రదాయ జ్ఞానం మన భారతీయ సంస్కృతిలో విలువైన భాగమన్నారు ప్రస్తుతం ఆధునిక జీవిత విధానంలో ప్రకృతికి దూరమవుతున్న పరిస్థితుల్లో సంప్రదాయ వైద్య విధానం పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు ఔషధ మొక్కలు లేదా ఆయుర్వేద మందులను ఉపయోగించే ముందు అర్హత కలిగిన ఆయుర్వేద వైద్యుల సలహా తీసుకోవడం ముఖ్యమని సూచించారు భారతీయ ఋషులు అందించిన ఆయుర్వేద విజ్ఞానాన్ని కేవలం పురాతన వైద్య విధానం గా కాకుండా శాస్త్రీయ అంశాలను అర్థం చేసుకొని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు ప్రజలకు ఆయుర్వేదం పై అవగాహన కల్పించడంతోపాటు ఔషధ మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని కోరారు ఆయుర్వేద జాతీయ దినోత్సవం సందర్భంగా మన పూర్వీకులు అందించిన ఈ అమూల్యమైన ఆరోగ్య సంపదను స్మరించుకోవడం, ఆయుర్వేద ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.

## 30 న క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాస్థాయి యువ జనోత్సవ పోటీలు

### - జిల్లా యువజన సంక్షేమ శాఖ..

### స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి శ్రీమన్నారాయణ వెల్లడి



**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

ఔత్సాహిక యువ కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం జిల్లాలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు, ఆ కోవలోనే ఈ సంవత్సరం జిల్లా స్థాయి యువజనోత్సవాలు తేదీ 30న క్విస్ ఇంజినీరింగ్ కళాశాల నందు జరుగుతాయని స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా యువజన సంక్షేమ అధికారి పి శ్రీమన్నారాయణ వెల్లడించారు. జిల్లా స్థాయి యువజనోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ పి రాజా బాబు తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ యువజనోత్సవాలలో భాగంగా ఫోక్ డ్యాన్స్(గ్రూప్), ఫోక్ సాంగ్ (గ్రూప్), పద్య రచన, వీధినాటకం, చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా యువజనోత్సవాలలో ప్రథమ స్థానం పొందిన వారిని రాష్ట్ర స్థాయిలో జరుగు యువజనోత్సవాల్లో జిల్లా తరుపున పాల్గొనుటకు, అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం జనవరి 12న జరుగు జాతీయ యువజనోత్సవాలలో పాల్గొనుటకు ప్రభుత్వ ఖర్చులతో పంపడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 15-29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని తమ ప్రతిభను ప్రదర్శించుటకు ఈ జిల్లా స్థాయి యువజనోత్సవాలలో పాల్గొనుటకు గాను వారి వివరాలను ఈనెల తేది: 29 లోపు 30.10.2026 న నేరుగా ఉదయం 9.00 గంటల లోపు క్విస్ ఇంజినీరింగ్ కళాశాల నందు హాజరై తమ పేర్లను నమోదు చేసుకొని పోటీలలో పాల్గొనవలసినదిగా పి. శ్రీమన్నారాయణ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇతర వివరములకు కార్యాలయపు పని వేళలో ఫోన్ నెం. 9573464848, 7780433828 ద్వారా కాని నేరుగా కానీ సంప్రదించాలని కోరారు.

# అంబటి అడ్డంగా బుక్కైనట్టేనా



**గుంటూరు, సెప్టెంబర్ 23,పెన్ పవర్:** లిక్కర్ స్కామ్‌లో ఈడీ నోటీసులు ఇస్తే 90 ఎంఎల్ డైలాగులు చెప్పిన అంబటి రాంబాబుకు అసలు నిజం తెలుసు. లిక్కర్ స్కామ్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేయడంతో ఆయన గారికి అసలు భయం పట్టుకుంది. తొలుత ఈడీ నోటీసులే రాలేదని, తనకేమీ తెలియనట్లు అమాయకపు నటన ప్రదర్శించిన అంబటి.. తీరా విషయం ముదిరి పాకాన పడటంతో నాకేం భయం లేదు.. ఆరోగ్యం కుదుటపడ్డాక విచారణకు వెళ్తా అంటూ కొత్త కవరింగ్ కథనాలు మొదలుపెట్టారు. ఎందుకంటే ఆయన దందాపై పూర్తి సాక్ష్యాలు ఈడీ వద్ద ఉన్నాయి.అంబటి రాంబాబు ఎంత నాటకమాడినా మద్యం కుంభకోణంలో ఆయన పాత్రను దర్యాప్తు సంస్థలు పక్కా ఆధారాలతో పట్టుకున్నాయనేది బహిరంగ రహస్యంగా మారింది. అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భారీ ఎత్తున సాగిన మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఈడీ ఈ నోటీసులు జారీ చేసింది. మద్యం విధానంలో జరిగిన అవకతవకలు, నిధుల మళ్లింపు, మనీలాండరింగ్ కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. తమ ఎదుట విచారణకు హాజరుకావాల్సిందిగా ఆయనను ఆదేశించింది.ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా, విక్రయాల ప్రక్రియలో అంబటి రాంబాబు పాత్రపై ఈడీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. మద్యం అక్రమ రవాణాకు సంబంధించిన సబ్ కాంట్రాక్టులను నిబంధనలకు విరుద్ధంగా అంబటి బినామీ సంస్థలకు కట్టబెట్టారనే అభియోగాలు దర్యాప్తులో తెరపైకి వచ్చాయి. మద్యం సిండికేట్ల నుంచి ముడుపులు ఎలా మళ్లాయి, వాటి వెనుక ఉన్న బినామీ నెట్‌వర్క్, డొల్ల కంపెనీల ఆర్థిక లావాదేవీలపై అధికారులు లోతైన ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పీఎంఎల్‌ఏ చట్టం కింద అంబటికి నోటీసులు జారీ చేసి సమగ్ర వివరణ కోరింది.ఈ నోటీసుల వ్యవహారాన్ని అంబటి దాచి పెట్టే ప్రయత్నం చేశారు. రెండు వారాలుగా అనారోగ్య కారణాలతో తాను హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నానని, ఈ క్రమంలోనే ఈడీ అధికారులు ఫోన్ చేసి ఈనెల 11నే నోటీసులు పంపినట్లు చెప్పారని ఆయన పేర్కొన్నారు. అయితే నోటీసులు చేతికి రాకపోవడం వల్లే విచారణకు రాలేకపోయానని, ఏ కేసులో నోటీసులు ఇచ్చారనేది పత్రాలు చూస్తే తప్ప స్పష్టత రాదని అధికారులకు తెలిపినట్లు సమాచారం. మరోవైపు, ఈవారంలోనే హైదరాబాద్ , విజయవాడలోని ఈడీ కార్యాలయంలో ఆయన విచారణకు హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఏపీ లిక్కర్ స్కామ్‌పై ఓవైపు రాష్ట్ర సిట్ , మరోవైపు ఈడీ దర్యాప్తును ముమ్మరం చేస్తుండటంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక వ్యక్తులు, ప్రజాప్రతినిధులు దర్యాప్తు సంస్థల విచారణను ఎదుర్కొంటున్నారు. కారుమూరి, ఆయన కుమారుడు జైలు పాలయ్యారు. అంబటి తనకేమీ సంబంధం లేదని బుకాయించే ప్రయత్నం చేసినా.. ఆధారాల్లేకుండా ఈడీ నోటీసులు ఇచ్చే అవకాశం ఉండదు.జగన్ హయాంలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన బినామీలుగా ప్రచారంలో ఉన్న సుబ్బారెడ్డి, పురుషోత్తం అనే వ్యక్తులను రంగంలోకి దించిన అంబటి.. వారికి మద్యం సరఫరా, డిస్ట్రిబ్యూషన్ కాంట్రాక్టులు కట్టబెట్టారని విచారణలో తేలినట్లు సమాచారం. ఆ కాంట్రాక్టర్ల వద్ద నుంచి భారీ ఎత్తున కమిషన్లు, నిధులు దండుకున్న వైనంపై సిట్, ఈడీలకు సదరు బినామీలే స్వయంగా పూసగుచ్చినట్లు వివరాలు ఇచ్చేశారని, డబ్బులు ఎలా మార్పిడి జరిగాయో ఆధారాలతో సహా అప్పగించారని ప్రచారం జరుగుతోంది.అంబటి గారు అడ్డంగా దొరికిపోవడంతోనే ఇప్పుడు అసలైన వణుకు మొదలైంది. ఇప్పటికే నేతలు కారుమూరి నాగేశ్వరరావు లాంటి వారు జైలు బాట పట్టిన దృశ్యాలు కళ్లముందు కదులుతుండటంతో, ఎక్కడ ఈడీ అధికారులు తనను కూడా నేరుగా అదుపులోకి తీసుకుని రిమాండ్ కార్డ్ ఇస్తారోనని ఆయన భయాందోళనకు గురవుతున్నారు. సాధారణ పోలీసు కేసుల్లా కాకుండా, ఈడీ చట్టం కింద అరెస్ట్ అయితే అంత సులువుగా బెయిల్ రాదని, ఎంతటి వారికైనా కటకటాలు తప్పవని తెలిసి ఆయన నిద్రలేని రాత్రులు గడుపుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.టివి ఛానళ్లలో ఎదుటివారిపై పంచ్‌లు వేస్తూ, వెటకారాలతో కాలక్షేపం చేసిన అంబటి రాంబాబుకు.. ఇప్పుడు తన సొంత బినామీలే ఇచ్చిన వాంగ్మూలాలు పెద్ద ఉచ్చుగా మారాయి. మైకుల ముందు నాకేం భయం లేదు అని ఎంత గంభీరంగా నటించినా, లోలోపల మాత్రం ఈడీ అరెస్ట్ వారెంట్ ఎప్పుడు తలుపు తడుతుందోనని బెదిరిపోతున్నారనేది స్పష్టమవుతోంది. గతంలో నడిపిన లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతుంటే, ఈడీ విచారణ నుంచి తప్పించుకోవడానికి ఆరోగ్యం సాకుగా చూపే కవరింగ్ డ్రామాలు ఇకపై చెల్లకపోవచ్చు.

# పిఠాపురంలో పవన్ మార్క్



**కాకినాడ సెప్టెంబర్ 23, పెన్ పవర్:** డిప్యూటీ సీఎం క్యాంపు ఆఫీసును పిఠాపురానికి మార్చాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నారు తన వద్దకు సమస్యల పరిష్కారం కోసం వస్తున్న ప్రజల అర్జీలను స్వీకరించడానికి, స్థానిక సమస్యలను నేరుగా పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిన పార్టీ కమిటీ పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరింత అందుబాటులో ఉండేందుకు డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్‌నే పిఠాపురానికి తరలించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.తన పర్యటనల్లో అనేకమంది ప్రజలు వినతిపత్రాలు చేతుల్లో పట్టుకుని కిలోమీటర్ల మేర నిలబడుతుండటం తనను తీవ్రంగా ఆలోచింపజేసిందని పవన్ కల్యాణ్ తెలిపారు. పిఠాపురం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు , వారి వినతులను స్వీకరించేందుకు జనసేన తరఫున ఒక ప్రతినిధి కమిటీని నియమించినప్పటికీ, ఆ కమిటీ బాధ్యతాయుతంగా పనిచేయడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడంపై అసహనం వ్యక్తం చేసిన ఆయన, ఇకపై బాధ్యతలను నేరుగా తమ ప్రభుత్వ యంత్రాంగమే చూసుకుంటుందని స్పష్టం చేశారు.స్థానిక నాయకత్వం , కమిటీ పనితీరు సరిగా లేకపోవడంతో, తానే స్వయంగా ప్రజా సమస్యలను పర్యవేక్షించాలని నిర్ణయించుకున్నట్లు పవన్ పేర్కొన్నారు. అందులో భాగంగానే డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్ సేవలను పిఠాపురానికి విస్తరించడం, ఇక్కడి నుంచే నిర్వహించేలా మార్పులు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. పూర్తిస్థాయి క్యాంప్ ఆఫీస్ ఏర్పాటుకు మరో మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందని, ఆ తర్వాత స్థానిక పాలన, ప్రజా అర్జీల స్వీకరణ అంతా పిఠాపురం నుంచే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, నియోజకవర్గానికి అవసరమైన అభివృద్ధి పనులతో పాటు ప్రజల వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ నిర్ణయంతో పిఠాపురం నియోజకవర్గం త్వరలోనే రాష్ట్ర రాజకీయాలకు , పాలనకు కేంద్రబిందువుగా మారనుంది.ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం శాసనసభ్యుడు పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీకి అవసరమైన మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ , ఆధునిక సదుపాయాల సమకూర్చే దిశగా దాదాపు రూ. 1,500 కోట్ల వ్యయంతో బహుళ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పిఠాపురం సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పాలనాపరమైన, ఆర్థికపరమైన సంస్కరణలను వేగవంతం చేస్తున్నారు.ప్రత్యేకించి నియోజకవర్గంలో భూగర్భ జలాల పునరుద్ధరణ, గ్రామీణ పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెరువుల సుందరీకరణకు పవన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ఫకృద్దీన్ పాలెంలో మైసమ్మ చెరువును రూ. 73 లక్షలతో సుందరీకరించి వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ ఎయిర్ జిమ్ వంటి వసతులతో గ్రామ ప్రజలకు ఆహ్లాదకర కేంద్రంగా తీర్చిదిద్దారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 6 కోట్లకు పైగా వ్యయంతో 14 చెరువులను ఆధునీకరించి, గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభను తీసుకువస్తున్నారు.పట్టణ పర్యావరణం, ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు జాతీయ రహదారికి సమీపంలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో రూ.1.83 కోట్ల వ్యయంతో పీఠికాపుర వనం పట్టణ అటవీ ప్రాజెక్టును ఆవిష్కరించారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ఏర్పాటు, పాఠశాలలు,

ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునీకరణ, మోడల్ అంగన్వాడీ కేంద్రాల నిర్వహణతో పాటు రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపుతున్నారు. పిఠాపురం పుణ్యక్షేత్రమైనందున పర్యాటకాభివృద్ధికి సైతం పెద్దపీట వేస్తున్నారు.అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు , పరిపాలనా వేగాన్ని పెంచేందుకు పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కి స్వయంప్రతిపత్తి హోదాను కల్పించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో పనిచేసే ఈ సంస్థ ద్వారా ప్రణాళికాబద్ధంగా మౌలిక వసతులు, ఆర్థిక వృద్ధి , ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న ఈ చొరవలతో పిఠాపురం రూపురేఖలు వేగంగా మారుతున్నాయి.

# కొత్త మిత్రుల కోసం జగన్ వ్యూహాలు

**విజయవాడ, సెప్టెంబర్ 23, పెన్ పవర్:**
2024 ఎన్నికల ఓటమి తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గతంలో లాగా ఒంటరి పోరాటం చేయడానికి ఇప్పుడు వెనుకడుగు వేస్తున్నారు. కూటమి భుత్వం అత్యంత బలంగా ఉండటం, క్షేత్రస్థాయిలో వైసీపీ కేడర్ చెల్లాచెదురు కావడం, వరుస కేసులు, అరెస్టులతో .. జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ప్రత్యక్షంగా , పరోక్షంగా అదనపు బలాల కోసం ఆరాటపడుతున్నారు. తాము ఎవరితోనైనా కలిసి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని వైసీపీ ముఖ్య నేత సజ్జల రామకృష్ణారెడ్డి పదే పదే సంకేతాలు పంపుతున్నా.. అటువైపు నుండి సానుకూల స్పందన కరువైంది.జగన్మోహన్ రెడ్డి రాజకీయ వ్యూహాలు ఎప్పుడూ భిన్నంగా ఉంటాయి. ప్రస్తుతం ఆయన పరోక్ష రాజకీయంపైనే ఎక్కువ నమ్మకం పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. సోషల్ మీడియాలో వ్యవస్థలను, కూటమి నేతలను టార్గెట్ చేయడానికి జోసఫ్ రావణ్ వంటి వారిని భారీ బడ్జెట్‌తో రెడీ చేసుకుని, షాడో పాలిటిక్స్ నడుపుతున్నారు. కానీ, ప్రత్యక్షంగా తన ఓటు బ్యాంకుకు అదనపు ఓటు బ్యాంకును జోడించగల బలమైన పార్టీలను మాత్రం ఆయన దరిచేర్చుకోలేకపోతున్నారు. మరోవైపు జడ శ్రవణ్ కుమార్ వంటి నేతలు, దళిత ఓటు బ్యాంకును టార్గెట్ చేస్తూ జగన్ రాజకీయాలలోని లోపాలను ఎండగడుతున్నారు. ఇది వైసీపీకి కోలుకోలేని దెబ్బగా పరిణమించే అవకాశం ఉంది.ప్రస్తుత రాజకీయ సమీకరణాలలో జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీతో కలిసే అవకాశం

ఏమాత్రం లేదు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ఉనికి నామమాత్రంగానే ఉన్నా, జాతీయ స్థాయిలో ఆ పార్టీతో వైసీపీ బంధం కుదరదు. పైగా, రాష్ట్రంలో పిసిసి అధ్యక్షురాలిగా ఉన్న తన సోదరి వైఎస్ షర్మిల తో ఉన్న తీవ్రమైన ఆస్తుల వివాదం, రాజకీయ వైరం కారణంగా జగన్ కాంగ్రెస్‌తో వెళ్లాలనుకున్నా వెళ్లలేరు. ఇక మిగిలిన ప్రధాన పార్టీలన్నీ కూటమిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, కనీసం కమ్యూనిస్టు పార్టీలైనా వైసీపీతో కలిసి వస్తాయని జగన్ ఆశిస్తున్నారు. ఇందుకోసం లెఫ్ట్ పార్టీల నేతలతో వైసీపీ రాయబారాలు నడుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.కనీసం లెఫ్ట్ పార్టీలైనా వైసీపీతో కలిసి నడుస్తాయా? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. కమ్యూనిస్టు పార్టీలు సిద్ధాంతపరంగా బీజేపీని తీవ్రంగా వ్యతిరేకిస్తాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంట్‌లో పదేళ్లపాటు పరోక్షంగా పూర్తి మద్దతు ఇచ్చిన వైసీపీతో కమ్యూనిస్టులు కలవడం అంత ఈజీ కాదు. పైగా, గత వైసీపీ హయాంలో అమరావతి రైతుల పోరాటం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ

ప్రైవేటీకరణ, ఉద్యోగుల సమస్యలపై లెఫ్ట్ పార్టీలు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాయి. ఇప్పుడు అకస్మాత్తుగా జగన్మోహన్ రెడ్డితో చేతులు కలిపితే.. ఆ పార్టీల విశ్వసనీయత దెబ్బతింటుందని కొందరు లెఫ్ట్ నేతలు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను వాడుకోవడానికి సిద్ధాంతాలను పక్కనబెట్టి వైసీపీతో జతకడతారా? లేదా ఒంటరి గానే పోరాడతారా? అన్నది వేచి చూడాలి.నలుగురు మిత్రులు లేకుండా రాజకీయం చేయడం ఎంత కష్టమో జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు అర్థమవుతోంది. పరోక్ష వ్యూహాలు కొంతవరకు బజ్ క్రియేట్ చేయగలవు కానీ, ప్రత్యక్షంగా ఎన్నికలలో గెలవాలంటే బలమైన సామాజిక, రాజకీయ సమీకరణాలు అవసరం. ఒకవైపు తన ఓటు బ్యాంకును జడ శ్రవణ్ వంటి వారు టార్గెట్ చేస్తుంటే, మరోవైపు మిత్రపక్షాల కోసం సజ్జల రామకృష్ణారెడ్డి పంపుతున్న సందేహాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం కమ్యూనిస్టులైనా వైసీపీతో కలవకపోతే.. రాబోయే రోజుల్లో వైసీపీ ఉనికి మరింత ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

# 27న జాషువా 131వ జయంతి వేడుకలు

## బోయి భీమన్న పురస్కార గ్రహీత డా.భూసురపల్లికి అభినందన సభ

**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

ఈనెల 27న స్థానిక ఒంగోలులోని శివ ప్రసాద్ కాలనీ కొత్తడొంక నందుగల పి.జి.యన్.ఎఫ్(స్త్రీ శక్తి సదన్) భవన్ లో నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 131 వ జయంతి వేడుకలను నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం) మరియు కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థల సంయుక్త నిర్వహణలో నిర్వహిస్తున్నట్లు నరసం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు తేళ్ళ అరుణ, కళామిత్రమండలి సంస్థ జాతీయ అధ్యక్షులు డా. నూనె అంకమ్మరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఇటీవలే మహాకవి బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్న కళారత్న సరస్వతీ పుత్రులు డా. భూసురపల్లి వెంకటేశ్వర్లుకు అభినందన సభను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సభకు నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు కళారత్న డా.నాగభైరవ ఆదినారాయణ.. నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, విశిష్ట అతిథులుగా శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ డాక్టర్ చాపలవంశీకృష్ణ , డాక్టర్ శాంత కుమారి, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు,ప్ర.ర.స గౌరవాధ్యక్షులు మిడసల మల్లిఖార్జునరావు, నరసం రాష్ట్ర కోశాధికారి బీరం అరుణ , నరసం జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు పరాంకుశం కృష్ణవేణి, రామచంద్రుని లక్ష్మి, యు.వి.రత్నం , నాళం నరసమ్మ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కావున కవులు, రచయితలు, కళాకారులు, గుర్రంజాషువా అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

# ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కునేందుకు చర్యలు తీసుకోవాలి

## - అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో పంటల సాగు, తాగు, సాగునీరు, పశుగ్రాసం సభ్యత, వర్షపాతం నమోదు తదితర అంశాలపై ఈ సమావేశంలో ఆయన ఆరా తీశారు. ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేలా ముందస్తుగానే ప్రణాళిక రూపొందించాలని, పరిస్థితిని నిరంతరం గమనిస్తూ ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖల మధ్య ఆయా విషయాలలో సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలన్నారు. దీని కోసం జిల్లా వ్యవసాయ అధికారిని నోడల్ అధికారిగా నియమించారు. వర్షపాతం, పంటల సాగు, నీటి లభ్యత, అందుబాటులోని పశుగ్రాస నివేదికలను అనుబంధ శాఖల ద్వారా ప్రతిరోజూ తెప్పించుకుని పూర్తిస్థాయి సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పశు సంవర్ధక అధికారి నాగమణి, సిపిఓ సుధాకర్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆయుష్ శాఖ.. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంయుక్తంగా ఆయుర్వేదం పై అవగాహన సదస్సు

**ఒంగోలు టౌన్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**




11 వ జాతీయ ఆయుర్వేద దినోత్సవ సందర్భముగా మోడీ గారి 76 వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు జరిగే సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఆంధ్ర కేసరి విద్యా కేంద్రం వారి సౌజన్యంతో ఆయుష్ శాఖ.. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంయుక్తంగా ఆయుర్వేదం పై అవగాహన సదస్సు, మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద జీవన విధానం యొక్క ప్రాముఖ్యత, జీవన విధానం, వైద్యం గురించి మాట్లాడటానికి ఆంధ్రా ఆయుష్ డిపార్ట్మెంట్ రీజినల్ డైరెక్టర్ శేఖర్ రాజు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భ్రమరాంబ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ గుర్రం సత్యనారాయణ, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పున్నయ్య లు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు దినచర్య లో తమ అలవాట్లు మార్చుకోవాలని , ఆరోగ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఒత్తిడిని ఎలా అధిగమించాలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ లో దానికి సంబంధించి ఉన్న కోర్సు లు గురించి తెలిపారు. అనంతరం హెల్త్ క్యాంప్ లో మెడిసన్స్ పంపిణీ చేశారు. మెడికల్ క్యాంప్ ను నిర్వహణ ఆయుష్ శాఖ సిబ్బంది ఎం. శ్రీనివాసులు, రమాదేవి పర్యవేక్షించారు.

# దసరా, దీవాళికి స్పెషల్ ట్రైన్స్...

**నెల్లూరు, సెప్టెంబర్ 23, పెన్ పవర్:** పండగలు వచ్చేస్తున్నాయ్.. వచ్చే నెలలో దసరా, దీపావళి రానున్నాయి. ఈ రెండు పండగల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారా? అయితే, మీకో గుడ్ న్యూస్.. పండగ ప్రయాణికులకు భారత రైల్వే శుభవార్త చెప్పింది.పండగల సమయంలో రైళ్లపై పెరగనున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా 100 ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ స్పెషల్ ట్రైన్లు నవంబర్ వరకు వివిధ మార్గాల్లో నడవనున్నాయి. ఇప్పటికే కొన్ని రైళ్లకు బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, అస్సాం, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలను కలుపుతూ ఈ ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల మీదుగా వెళ్లే పలు రైళ్లు ప్రయాణికులకు ఉపయోగపడనున్నాయి.

చర్లపల్లి--నాగర్‌కోయిల్ (07535) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం నడుస్తుంది. నల్లగొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, చెన్నై ఎగ్మోర్, తిరుచిరాపల్లి తదితర స్టేషన్లలో ఆగుతుంది.

అలాగే, చర్లపల్లి--శ్రీకాకుళం (07037) రైలు అక్టోబర్ 6 నుంచి నవంబర్ 24 వరకు, తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం--చర్లపల్లి (07038) రైలు అక్టోబర్ 7 నుంచి నవంబర్ 25 వరకు సర్వీసులు అందించనున్నాయి. ఈ రైళ్లు నల్లగొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విజయనగరం తదితర స్టేషన్లలో ఆగుతాయి.మరోవైపు.. ప్రయాగ్‌రాజ్--తిరునెల్వేలి (04171) ప్రత్యేక రైలు కూడా తెలుగు రాష్ట్రాల మీదుగా నడుస్తుంది. ఈ సర్వీసు రామగుండం, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు తదితర ప్రాంతాలను కలుపుతుంది

# పదవి విరమణ మాత్రమే.. రాజకీయ విరమణ కాదు

## - ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి వీడ్కోలు సభలో ఘన సన్మానం

## - ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగింపు.. -నాయకులు, కార్యకర్తల ఆత్మీయ వీడ్కోలు





**తర్లుపాడు పెన్ పవర్ సెప్టెంబర్ 23**

పదవి విరమణ మాత్రమేనని.. రాజకీయ విరమణ కాదని ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి అన్నారు. మండలంలోని ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో బుధవారం పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రేణులు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంపీపీతో పాటు ఆయా గ్రామాల ఎంపీటీసీలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి మాట్లాడుతూ.. పదవిలో ఉన్న సమయంలో మండల అభివృద్ధికి తనవంతు కృషి చేశానన్నారు. ఎంపీపీగా పనిచేసే అవకాశం కల్పించిన ప్రజలకు, సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పదవి ముగిసినా ప్రజలకు, పార్టీ శ్రేణులకు తన సేవలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజలతో తన అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని పేర్కొన్నారు.

**ప్రజాసేవకు పదవులు అడ్డంకి కావు**

మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు మురారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎంపీపీగా సూరెడ్డి భూలక్ష్మి అందించిన సేవలు అభినందనీయమన్నారు. పదవిలో ఉన్న సమయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఆమె నిరంతరం కృషి చేశారని తెలిపారు. పదవీకాలం ముగిసినప్పటికీ ప్రజా జీవితంలో ఆమె సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. పార్టీకి, కార్యకర్తలకు ఆమె మార్గదర్శకత్వం ఎప్పటికీ అవసరమని అన్నారు.

**ఎంపీటీసీల సేవలు ప్రశంసనీయం**

ఇతర నాయకులు సంయుక్తంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ఎంపీపీ, ఎంపీటీసీల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పదవీకాలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆయా గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ప్రజాప్రతినిధులుగా అందించిన సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. పదవులు మారినా ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు.

**ఘన సన్మానం.. అన్నదానం**

అనంతరం ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మితో పాటు మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీలను నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు శాలువాలు, పుష్పమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎంపీపీతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం ఎంపీపీ ఆధ్వర్యంలో విచ్చేసిన వారందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం సతీమణి భువనేశ్వరిని కలిసిన డాక్టర్ ఏలూరి



**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి, ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి బుధవారం తిరుమలలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత ఐదారేళ్లుగా తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో నిర్వహించిన మెడికల్ క్యాంపులు, మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు, కోవిడ్ సమయంలో చేసిన సేవలను డాక్టర్ ఏలూరి భువనేశ్వరికి వివరించారు. ట్రస్ట్ సేవలను తెలుసుకున్న భువనేశ్వరి ఆయనను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అలాగే మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పూర్తి చేసి కృష్ణా జలాలను విడుదల చేయడం పట్ల డాక్టర్ ఏలూరి కృతజ్ఞతలు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును సందర్శించాలని కోరగా, తప్పక సందర్శిస్తానని భువనేశ్వరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి, టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతులకు ప్రభుత్వం అందజేసే పథకాలు అందేలా చూడాలి

### ఏడి సుదర్శన్ రావు





**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

పాడి రైతులకు, పశు పోషకులకు అందజేసే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఏడి సుదర్శన్ రావు అన్నారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం వెలుగు కార్యాలయంలో బుధవారం పామూరు, సి ఎస్ పురం మండలాల పశు వైద్య సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు పశు కేంద్రాలకు వచ్చే రైతులకు సలహాలు సూచనలు అందిస్తూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో సి ఎస్ పురం, పామూరు పశు వైద్యాధికారులు డాక్టర్ షేక్ మునీర్, డాక్టర్ హనుమాన్ మరియు ఆయా మండలాల్లోని పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

# మరియ దాసు కుటుంబానికి అండగా ఉంటాం

**- మరియు దాసు భార్యకు 21 లక్షల 15 వేల రూపాయల చెక్కును అందజేసిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు**




**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

ఆక్సిడెంట్ లో మృతి చెందిన బాధిత పోలీస్ కుటుంబానికి గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ (జిపిఏఐ) చెక్కును బుధవారం జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు అందజేశారు. ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ, 2026 జూలై 12న ఉదయం ఒంగోలు టౌన్‌లోని పద్మ టవర్స్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏ.ఆర్. కానిస్టేబుల్ మరియదాసు సతీమణి కె.భారతి కి రూ. 21,15,000/- చెక్కును అందజేశారు. జిల్లా ఎస్పీ కానిస్టేబుల్ కుటుంబ సభ్యుల యోగక్షేమాలను, పిల్లల చదువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు. ఈ సందర్భంగా అందజేసిన చెక్కు ద్వారా లభించే ఆర్థిక సహాయం కుటుంబానికి కొంతమేర ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలీసు శాఖ పరంగా మృతిచెందిన సిబ్బందికి అందాల్సిన ఇతర ప్రయోజనాలను కూడా త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతిచెందిన సిబ్బంది కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఏదైనా సమస్య ఉన్న నేరుగా తనను కలవవచ్చునని వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజకీయ జీవితం సామాజిక బాధ్యత తెలిపింది

### ఎంపీపీ దొంత కిరణ్ గౌడ్





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 23**

తాను మండల పరిషత్ అధ్యక్షునిగా పనిచేసిన ఐదేళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎంపీపీగా హోదా రావడమే కాకుండా, సామజిక బాధ్యత తెలిపిందని,మండల ప్రజలకు తన వంతుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని ఎంపీపీ దొంత కిరణ్ గౌడ్ అన్నారు. బుధవారం ఎంపీపీ, ఎంపీటీసీ ల పదవికాలం పూర్తయినా సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో పదవి విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిమంది బాగుకోసం పాటుపడితే ప్రజల మనస్సులో నిలిచిపోతామని, ప్రజలు మమ్మల్ని గుర్తుంచువాలని చెప్పిన తమ తండ్రి స్ఫూర్తితో ప్రజలకోసం పాటు పడ్డానని తెలిపారు. తాను ఎంపీపీ గా ఉన్న కాలంలో మండలంలో త్రాగు నీటి సమస్య, రహదారుల అభివృద్ధి, ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను తదితర కార్యక్రమాలను ప్రజలకు అందించేందుకు కృషి చేసానని అన్నారు. గత వైస్సార్సీపీ అధికారంలో తాను ఎంపీపీ అయ్యాక జిల్లా పరిషత్ నుంచి, ఎంపీ కోట నుంచి వచ్చిన నిధులతో అన్ని గ్రామాలలో ఎటువంటి తార తమ్యం లేకుండా నిశ్వార్థంతో సేవలు అందిచ్చానని తెలిపారు. మండలంలోని తోటి ఎంపీటీసీలు, అధికారులు మండల పాలనలో అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. గత ఐదేళు గాఅధికారులు మండల అభివృద్ధికి పాటుపడినట్లు అదేరితిగా ప్రస్తుత ప్రభుత్వంలో యర్రగొండపాలెం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.జడ్పీటీసీ చేదురి విజయ భాస్కర్ మాట్లాడుతూ మండల ప్రజల సమస్యలపరిష్కారంలో తమను ఎన్నుకున్న ప్రజలకు న్యాయం చేశామని అదే తమకు సంతృప్తి ఇచ్చిందని, ఇక ముందు కూడా మండల ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు.అనంతరం వివిధ శాఖల అధికారులు ఎంపీపీ దొంత కిరణ్ గౌడ్,జడ్పీటీసీ చేదురి విజయ భాస్కర్ లను ఘనంగా సన్మానించారు,ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, మండల కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

# పశుపోషకులకు అండగా ఎన్డిఏ కూటమి ప్రభుత్వం

### అమడసాని బాలకేశవరెడ్డి



**సి.ఎస్.పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పశుపోషకులు, పాడి రైతులకు అండగా నిలుస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని కోవిలంపాడు గ్రామ టిడిపి అధ్యక్షుడు అమడసాని బాలకేశవరెడ్డి అన్నారు.మండలంలోని కోవిలంపాడు-స్వర్ణ గ్రామ కార్యాలయంలో బుధవారం కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు, మండల టిడిపి అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ సూచనలతో అధికారుల సమక్షంలో పశు పోషకులకు సబ్సిడీపై గడ్డి జొన్న విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమడసాని బాలకేశవరెడ్డి పాల్గొని టిడిపి నాయకులతో కలిసి రైతులకు విత్తనాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సమృద్ధిగా పచ్చి మేత అందించేందుకు ప్రభుత్వం సబ్సిడీపై గడ్డి జొన్న విత్తనాలను అందించడం పాడి రైతులకు ఉపయోగకరమన్నారు. పశుపోషణను వ్యవసాయానికి అనుబంధంగా కొనసాగిస్తున్న రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గడ్డి జొన్న సాగుతో పశువులకు అవసరమైన పచ్చిమేతను అందుబాటులో ఉంచుకోవడంతో పాటు పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. పంచాయతీ పరిధిలోని పాడి, పంటల రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇంచార్జి మరియు జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ రజ్జాబ్ బాషా, నీటి సంఘం అధ్యక్షులు దొనపాటి మోహన్ రెడ్డి, బోయల్ల రాజేంద్ర, షేక్ ఖలీల్ భాషా, చావా ప్రభాకర్, షేక్ కబీర్, పశు సంవర్ధక సహాయకురాలు అమృత, డిజిటల్ అసిస్టెంట్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్ కార్డు అందజేయాలి

**- అక్టోబర్ మొదటివారంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఈ సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించాలి**

**- రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఆఫ్ హెల్త్ వీరపాండ్యన్ ,కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చక్రధర్ బాబు ఆదేశం**

**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్టోబర్ మొదటి వారం నుంచి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ-సంజీవని కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఆఫ్ హెల్త్ వీరపాండ్యన్ సూచించారు. రాష్ట్రంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రోగ్రాం అధికారులు, సంబంధిత అధికారులతో ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆఫ్ హెల్త్ వీర పాండియన్.. కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చక్రధర్ బాబు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలయ్యేలా గుర్తించిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సిహెచ్ఓ)ను తప్పనిసరిగా నియమించి బాధ్యతలు అప్పగించాలని తెలిపారు. అలాగే, డిజిటల్ హెల్త్ రికార్డు లేని పౌరుడు ఉన్న గ్రామం రాష్ట్రంలో ఉండకూడదనే లక్ష్యంతో ప్రతి పౌరుడికి హెల్త్ ఐడీ తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. హెల్త్ ఐడీ ద్వారా సంబంధిత వ్యక్తి ఆరోగ్య స్థితిగతులు, గతంలో పొందిన వైద్య సేవలు తదితర ఆరోగ్య సమాచారాన్ని వైద్యులు సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా అవసరమైన సమయంలో ప్రజలకు మెరుగైన, సమర్థవంతమైన వైద్య సేవలు అందించేందుకు ఈ-సంజీవని కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అర్హులైన ప్రజలందరికీ డిజిటల్ హెల్త్ రికార్డులు, హెల్త్ ఐడీలు కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. ఈ-సంజీవని సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి, టెలీమెడిసిన్ ద్వారా నాణ్యమైన వైద్య సలహాలు మరియు సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రకాశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి అడిషనల్ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ బాలాజీ, జిల్లా ప్రోగ్రాం అధికారి సుబ్బలక్ష్మి, కంప్యూటర్ అడ్మినిస్ట్రేటర్ శ్రీ రెడ్డి, డిప్యూటీ జిల్లా మాస్ మీడియా కె.ఏ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బధిరుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఏ. సత్యానంద్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఒంగోలు పట్టణంలోని ప్రభుత్వ బధిరుల పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరఫున మధ్యవర్తిత్వ న్యాయవాది షేక్ సంధాని, ప్యానల్ న్యాయవాది బచ్చు రాజేష్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టపరమైన రక్షణలు, ఉచిత న్యాయ సహాయం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే న్యాయ సేవల గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే, సంకేత భాష ప్రాముఖ్యతను వివరిస్తూ, వినికిడి, మాట్లాడే లోపాలు ఉన్న వ్యక్తులకు సమాజంలో సమాన అవకాశాలు, హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ బధిరుల పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీగిరిలో వైభవంగా శ్రీవారి ఆస్థానం

**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ సెప్టెంబర్ 23**

శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో వైభవంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం.. చతుర్వేద పారాయణ.. విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు భారత భాగవత భగవద్గీత రామాయణ శ్లోకాలను పద్యాలను గానం చేసారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణా రావు తదితరులు పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com